ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org

ప్రకాశిక

సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక

సంపుటి 6 | సంచిక 3 జులై-సెప్టెంబర్ 2026

మమత-సమత-మానవత
www.gurajada.org



సంపాదక మండలి

వ్యవస్థాపక సంపాదకులు
మహాకవి గురజాడ అప్పారావు

ప్రధాన సంపాదకులు
ఆచార్య కొవ్వలి గోపాలకృష్ణ (USA)

నిర్వాహక సంపాదకులు
శ్రీమతి అరుణ గురజాడ (USA)
శ్రీ గురజాడ రవీంద్రుడు *(విశాఖపట్టణం)*

విద్యాసంబంధిత ప్రచురణ విభాగ సంపాదకులు

కార్యనిర్వాహక సంపాదకులు
ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు
(హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్)

సంపాదక సలహాదారులు

ఆచార్య, సూర్యా ధనంజయ్
(ఉపకులపతి, చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, హైదరాబాదు)

ఆచార్య చల్లా శ్రీరామచంద్రమూర్తి
(అధ్యక్షులు, తెలుగుశాఖ, బెనారస్ హిందూ యూనివర్శిటీ, వారణాసి)

ఆచార్య మాడభూషి సంపత్ కుమార్
(సంచాలకులు, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, నెల్లూరు)

డా. వి.ఆర్. రాసాని
(విశ్రాంత ఆచార్యులు, తిరుపతి)

సంపాదకులు

ఆచార్య నల్లపరెడ్డి ఈశ్వర రెడ్డి
(యోగి వేమన విశ్వ విద్యాలయం, కడప)

ఆచార్య రాచుగాల్ల రాజేశ్వరమ్మ
(శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి)

ఆచార్య జొన్నలగడ్డ వెంకటరమణ
(మదురై విశ్వవిద్యాలయం, మదురై)

సహ సంపాదకులు

డా. నందవరం మృదుల, *(సహ ఆచార్యులు & తెలుగు విభాగాధిపతి, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్) బేగంపేట, హైదరాబాద్)*

డా. వి. వింధ్యవాసినీ దేవి, *తెలుగు ఉపన్యాసకులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు) క్లస్టర్ యూనివర్సిటీ, కర్నూలు*

కథలు, కవితలు, వ్యాసాల విభాగం

సంపాదకులు
డా. ఎస్. రఘు, *(సహాయ ఆచార్యులు, ఉస్మానియా విశ్వ విద్యాలయం, హైదరాబాదు)*

ISSN 2766-0168 | అంతర్జాల త్రైమాస పత్రిక | www.prakasika.org | editor@prakasika.org

ఎనిమిది పదుల ప్రౌఢ

1947లో భారత దేశం స్వాతంత్ర్యం పొందినప్పుడు భారతదేశ జనాభా సుమారు 34–35 కోట్లుగా అంచనా. ఆకలి, నిరక్షరాస్యత, తక్కువ ఆయుఃప్రమాణం ఆనాటి దేశపు సంపద. ఆ కాలంలో సగటు భారతీయుడి ఆయుఃప్రమాణం ముప్పై రెండేళ్లు, అక్షరాస్యత రేటు పద్దెనిమిది శాతం. పదిమందిలో ఎనిమిది మంది పల్లెల్లో, వ్యవసాయం మీద ఆధారపడి బతికేవారు. కరువు కాటకాలు పిలవకపోయినా సందర్శించే బంధువులు.

1951 జనగణన ప్రకారం, పదిహేనేళ్లలోపు పిల్లలు జనాభాలో ముప్పై ఐదు శాతానికి పైగా ఉండేవారు; పదిహేను నుంచి యాభై తొమ్మిదేళ్ల వయసున్న శ్రామిక వర్గం యాభై ఏడు శాతం; అరవై ఏళ్లు దాటిన వృద్ధులు కేవలం ఏడున్నర శాతం మాత్రమే ఉండేవారు. జనాభాలో సగం మంది ఇరవై ఒక్క ఏళ్లలోపు వారే. 2026 నాటికి భారత జనాభా నూట నలభై ఐదు కోట్లకు చేరువలో ఉంది. పదిహేనేళ్లలోపు పిల్లల సంఖ్య ముప్పై ఐదు శాతం నుంచి ఇరవై నాలుగు శాతానికి తగ్గగా, పదిహేను నుంచి యాభై తొమ్మిదేళ్ల శ్రామిక వర్గం యాభై ఏడు శాతం నుంచి అరవై ఐదు శాతానికి పెరిగింది, అరవై ఏళ్లు దాటిన వృద్ధుల వాటా ఏడున్నర శాతం నుంచి పదకొండు శాతానికి పెరిగింది. సగటు వయసు ఇరవై ఒక్క ఏళ్ల నుంచి ఇరవై తొమ్మిదేళ్లకు చేరింది. ఈ గణాంకాల వెనుక ఉత్తర–దక్షిణ అంతరం (north–south divide) ఉందన్న విషయం గమనించదగ్గది. దక్షిణాదిన జనాభా వృద్ధి రేటు తక్కువ ఉండడం వల్ల వృద్ధుల వాటా ఇప్పుడే ఎక్కువగా ఉంది; శ్రామిక వయసు జనాభా ప్రస్తుతం గరిష్ఠ స్థాయిలో ఉన్నా, ఇక ముందు వేగంగా తగ్గబోతోంది.

ఆనాటి భారత్ దేశ స్థూల జాతీయోత్పత్తి (GDP) రెండున్నర లక్షల కోట్ల రూపాయలు; తలసరి వార్షిక ఆదాయం రెండు వందల యాభై రూపాయలకు మించి ఉండేది కాదు. ఏంగస్ మాడిసన్ ఇచ్చిన అంచనాల ప్రకారం 1820లో ప్రపంచ GDPలో పదహారు శాతం వాటా కలిగి ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ, బ్రిటిష్ పాలన ముగిసేనాటికి కేవలం నాలుగు శాతానికి కుంచించుకుపోయింది. రెండు శతాబ్దాల వలస పాలన సృష్టించిన నష్టానికి ఇది ఒక కొలమానం. ఆర్థిక వ్యవస్థలో తొంభై ఐదు శాతం వ్యవసాయంపైనే ఆధారపడి ఉండేది, అయినా నీటిపారుదల, ఎరువులు, ఆధునిక సాంకేతికత లేమితో పంట దిగుబడులు అంతంతమాత్రమే ఉండేవి. విదేశీ మారక నిల్వలు కేవలం రెండు బిలియన్ డాలర్లు మాత్రమే ఉండేవి. టెలిఫోన్ కనెక్షన్లు లక్షా ఇరవై వేలకు మించి లేవు. తలసరి విద్యుత్ వినియోగం సంవత్సరానికి కేవలం పదహారు యూనిట్లు ఉండేది, అంటే వందవాట్ల బల్బు పది గంటలు వెలిగించడానికి సరిపడా విద్యుత్తు మాత్రమే ఒక్కొక్కరికి ఏడాదికి దక్కేది!

1991కి ముందు "లైసెన్స్‌రాజ్" వ్యవస్థలో బందీగా ఉన్న ఆర్థిక వ్యవస్థ, పి. వి. నరసింహారావు గారి విధానాల వల్ల వచ్చిన సరళీకరణ తర్వాత ప్రపంచంలోనే వేగంగా ఎదిగే ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా మారింది. 2026 నాటికి భారత GDP నాలుగు లక్షల పదిహేను వేల కోట్ల డాలర్లకు చేరిందని అంచనా. కొనుగోలు శక్తి సమానత్వం (PPP) పద్దెనిమిది లక్షల తొంభై వేల కోట్ల డాలర్లు. ఒకప్పుడు తొంభై ఐదు శాతం ఉన్న వ్యవసాయం వాటా పదిహేడున్నర శాతానికి కుదించుకుపోయింది. విదేశీ మారక నిల్వలు రెండు బిలియన్ డాలర్ల నుంచి ఐదు వందల డెబ్బై బిలియన్ డాలర్లకు పైగా పెరిగాయి. అయితే ఈ వృద్ధి ఫలాలు అందరికీ సమానంగా అందలేదు అనే విమర్శ కూడా అంతే బలంగా ఉంది. ఒకవైపు టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి కంపెనీలు లక్షలాది ఉద్యోగాలు సృష్టిస్తుంటే, మరోవైపు గ్రామీణ భారతంలో నిరుద్యోగం, వలసలు కొనసాగుతూనే ఉన్నాయి.

1947నాటికి దేశంలో స్వతంత్రమైన శాస్త్రీయ పరిశోధనా వ్యవస్థ అనేదే లేదు. సి.వి. రామన్ లాంటి కొద్దిమంది మేధావులు తప్ప, భారత్‌కు సొంత పరిశోధనా సంస్థలు, పారిశ్రామిక సాంకేతికత దాదాపు శూన్యం. హోమీ భాభా, విక్రమ్ సారాభాయ్ లాంటి దార్శనికులు స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలోనే అణుశక్తి, అంతరిక్ష పరిశోధనా పునాదులు వేశారు. అక్కడి నుంచి మొదలైన ప్రయాణం ఇప్పుడు ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తోంది. ఇస్రో (ISRO) 2023లో చంద్రయాన్–3 ద్వారా చంద్రుడి దక్షిణ ధ్రువం దగ్గర దిగిన మొదటి దేశంగా చరిత్ర సృష్టించింది; ఆదిత్య–L1 సూర్యుడిని అధ్యయనం చేస్తోంది; 2025లో స్పేడెక్స్ (SpaDeX) ద్వారా అంతరిక్షంలో రెండు ఉపగ్రహాలను జోడించే సాంకేతికత సాధించిన నాలుగో దేశంగా నిలిచింది; భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించాడు; 2027కు గగన్‌యాన్ ద్వారా సొంతంగా మనుషులను అంతరిక్షంలోకి పంపే ప్రయత్నంలో ఉంది. భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ విలువ ఇప్పుడు పదమూడు బిలియన్ డాలర్లకు చేరింది, రెండు వందలకు పైగా ప్రైవేట్ స్పేస్ స్టార్టప్‌లు పుట్టుకొచ్చాయి.

డిజిటల్ రంగంలో అయితే భారత్ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచింది. యూపీఐ (UPI) ద్వారా ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను నిర్మించుకుంది; 5జీ సేవలు ప్రారంభమైన ఏడాదిలోపే డెబ్బై శాతం జనాభాకు చేరాయి. రక్షణ రంగంలో డీఆర్‌డీఓ (DRDO) ద్వారా క్షిపణులు, రాడార్లు, డ్రోన్ల వంటి స్వదేశీ సాంకేతికతలు అభివృద్ధి చేసుకుంటూ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకుంటోంది. అయితే ఈ శాస్త్ర సాంకేతిక పురోగతిలో కూడా అసమానతలు స్పష్టంగా కనిపిస్తాయి. గ్రామీణ పాఠశాలల్లో ఇంటర్నెట్ మౌలిక వసతులు ఇంకా అంతంతమాత్రమే; STEM పట్టభద్రుల్లో నలభై మూడు శాతం మంది స్త్రీలు ఉన్నా, వృత్తి నిపుణుల్లో వారి వాటా ఇరవై నుంచి ముప్పై శాతానికే పరిమితం. మొత్తంగా చూస్తే, స్వాతంత్ర్యం వచ్చినప్పుడు తన సొంత సూది ఒకటి తయారు చేసుకోలేని దేశం, ఇప్పుడు అంతరిక్షంలో ఉపగ్రహాలను జోడించగలిగే స్థాయికి చేరడం అనేది ఈ ఎనభై ఏళ్ల ప్రయాణంలో నిస్సందేహంగా అత్యంత గర్వించదగ్గ అధ్యాయం.

కానీ ఈ ఎదుగుదల ఫలితాలు అందరికీ సమానంగా అందడం లేదు. గ్రామీణ ప్రాంతాలలో వైద్యం, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ధనికులు, పేదల మధ్య అంతరం పెరుగుతోంది. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రభుత్వ నియంత్రణ నుండి ప్రైవేట్ సంస్థల నిర్వహణ లోకి మారుతోంది. దీని పర్యవసానాలు ఆలోచించవలసిన విషయం.

ప్రజల ఆశలు, ఆకాంక్షలు వేగంగా మారుతున్నాయి. పరాయి పాలన నుంచి విముక్తి పొందిన సామాన్య భారతీయుడి కోరికలు చాలా మామూలుగా ఉండేవి. కడుపునిండా అన్నం, ఒంటిపై బట్ట, తలదాచుకోడానికి ఇల్లు– ఇవే కోరికలు. ప్రభుత్వం అంటే తమకు తిండి పెట్టేది, భూమి పంచేది, పాఠశాల కట్టేది, ఆసుపత్రి తెరిచేది అనే భావన ప్రజలలో ఉండేది.

1997 నుంచి 2012 మధ్య పుట్టిన “జెన్ జీ” (Gen Z) తరం పూర్తిగా భిన్నమైన ఆకాంక్షలతో నిలబడి ఉంది. దేశంలో పని చేయగల వయసున్న జెన్ జీ జనాభా దాదాపు ముప్పై కోట్లు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద జెన్ జీ సమూహాల్లో ఒకటి. వీరి ఆకాంక్షలు కడుపు నింపుకోవడం దగ్గర ఆగవు. వీరికి “అర్థవంతమైన పని” (meaningful work) కావాలి. ఈ తరం వాళ్ళు జీతం కంటే ఉద్యోగంలో సంతృప్తి, వ్యక్తిగత ఎదుగుదల ముఖ్యం అనుకుంటున్నారు. లింక్డ్ఇన్ వర్క్‌ఫోర్స్ కాన్ఫిడెన్స్ ఇండెక్స్ 2025 (ఇండియా) సర్వే ప్రకారం తొలి ఉద్యోగంలో ఏటా ఆరు నుంచి పది లక్షల జీతం ఆశిస్తున్నా, అర్థవంతమైన పని కోసం అంతకంటే తక్కువ జీతానికైనా ఒప్పుకుంటామని డెబ్బై ఒక్క శాతం మంది చెప్తున్నారు. కేవలం పదహారు శాతం మందికే ఒక సంప్రదాయ పూర్తికాల ఉద్యోగం మీద ఆసక్తి ఉంది. అరవై ఏడు శాతం మంది తాము పనిచేసే సంస్థ తమ మానసిక ఆరోగ్యాన్ని పట్టించుకోవాలని ఆశిస్తున్నారు. స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియా, ప్రపంచవ్యాప్త సమాచార ప్రవాహం మధ్య జెన్ జీ పుట్టి పెరిగింది. వీరి కళ్ళలో “మంచి జీవితం” అంటే ఆర్థిక భద్రత, జీవితకాలపు ఉద్యోగం మాత్రమే కాదు, గౌరవం, స్వేచ్ఛ, పని–జీవితం మధ్య సమతుల్యత కూడా ముఖ్యం. నవతరాన్ని ఉపేక్షిస్తే ఉద్యమించే ప్రమాదం ఉందన్నది సర్వవిదితం.

ఎనభై ఏళ్ల క్రితం నాటి ప్రజల అంచనాలు, ఈనాటి ప్రజల అంచనాలు ఒకే స్థాయిలో లేవు. అన్నం పెట్టే ప్రభుత్వం చాలదు ఇప్పుడు; నాణ్యమైన విద్య, ఉద్యోగ అవకాశాలు, డిజిటల్ మౌలిక వసతులు, పారదర్శకత, జవాబుదారీతనం కోరుకునే పౌరసమాజం ఏర్పడింది. పూర్తిస్థాయి ప్రైవేటీకరణ వల్ల భారత్ వంటి దేశాలలో జరిగే అనర్థాలు ఈ నాటి యువతకి శాపంగా మారాయి. యూకేజీలో లక్షతో మొదలయిన బడి ఫీజులు పీజీకి వచ్చేసరికి లక్షల్లోకి చేరడంతో ఉత్తమ విద్యతో ఉన్నత జీవన ప్రమాణం వస్తుందని నమ్మే మధ్యతరగతి కుటుంబాలు తలకు మించిన అప్పులు చేసి పిల్లలను చదివిస్తున్నారు. ప్రతిభావంతులకు కూడా అనువైన ఉద్యోగాలు దొరక్కపోవడంతో యువతలో నిరాశ నెలకొని ఉంది. ప్రజలకి వృద్ధాప్యంలో ఆరోగ్య, ఆహార భద్రత కల్పించడం పాలకుల కర్తవ్యం. దేశానికి మారుతున్న తరం ఆకాంక్షలకు అనుగుణంగా పాలనా వ్యవస్థలని మెరుగుపరచడం భారతదేశ ప్రభుత్వాల తక్షణ కర్తవ్యం.

భవదీయుడు

డాక్టర్ కొవ్వలి గోపాలకృష్ణ

ప్రధాన సంపాదకులు, ప్రకాశిక

ముఖచిత్రం



లోపల

భారతస్వాతంత్ర్య పర్వదినము – శ్రీ బులుసు వేంకటేశ్వర్లు.................. 9

ఆగష్టు పదిహేను – 11

మానవతావాది గురజాడ – డా. భమిడిపాటి గౌరీశంకర్ 17

బంజారాల బ్రతుకు చిత్రాలు – డా. మంత్రి శ్రీనివాస్ 22

'పిరదౌసి' కావ్యంలో 'తేటగీతి' అక్షర దుందుభి
– విల్సన్ రావు కొమ్మవరపు 34

హైకూలు – డా. వి.ఆర్.రాసాని.. 44

బంజారా ఆత్మగౌరవం అక్షరాలైన కావ్యం "ధూళి చక్రాలు"
– డా. యడవల్లి సైదులు 45

రాయలసీమ అస్తిత్వం – మూడు పార్శ్వాలు – జి. త్రివిక్రమ్ 54

మరుగున పడుతున్న మాతృభాషలు – డా. మానమ మునిరత్నం 62

ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు, ఆయా రచయితల స్వంతం. పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధమూ లేదు.

భారతస్వాతంత్ర్య పర్వదినము

శ్రీ బులుసు వేంకటేశ్వర్లు

పరదేశనరపాలపరిపాలనావధి భారతస్వాతంత్ర్యపర్వదినము
బహు భారతీయ తపస్సిద్ధిశుభతిథి భారతస్వాతంత్ర్య పర్వదినము
సకలప్రపంచవిజ్ఞ ప్రమోదకరంబు భారతస్వాతంత్ర్యపర్వదినము
ప్రాగ్దేశ దైన్యజీవనజనాశాజ్యోతి భారత స్వాతంత్ర్య పర్వదినము
భారతీయుల నోముల ఫలము పరమ–భవ్యదివస మాబాలగోపాలమునకు
నవ్యజవజీవసంపదున్నతికరంబుఁ బరమభారతస్వాతంత్ర్య పర్వదినము.

తమ సమస్తము భారతస్వతంత్రతకునై ధారపోసిన మహాధార్మికులును
భారతస్వాతంత్ర్యఫలసిద్ధికై పోరి జీవముల్ విడిచిన పావనులును
తమ యమోఘపు జీవితములు కారాగృహంబులకె యర్పించిన
పూతతనులు
ఆశయసిద్ధి కత్యాచారము లొనర్చి ధీరులై మడిసిన వీరనరులు
పరమసంభావనీయు లెప్పటికీ మనకుఁ – బ్రథమపరిగణనీయు లెప్పటికి మనకుఁ
బ్రబల గౌరవనీయు లెప్పటికి మనకు – భవ్య భారత స్వాతంత్ర్యపర్వములను.

సత్యం బహింసయు శస్త్రాస్త్రసమితి, సత్యాగ్రహంబే ప్రబలాయుధంబు
కదురుగవ్వంబులే ఖడ్గముద్గరములు, ఖద్దరు బట్టలే కవచములును
నూలుతీయుటె శత్రుజాలంబునసువులు తీయుటల్ త్రెంచుటె త్రెంచుటలును
అమలమానవుల నిరాహారదీక్షలే శత్రుమారణయంత్రసముదయములు
విమల భారతస్వాతంత్ర్యసమరమందు–భారతీయుల యాయుధపరికరములు
మఱవ రానివి ముల్లోక మానవులకు– భవ్య భారతస్వాతంత్ర్య పర్వములను,

ఉపనిషన్మతము గీతోపదిష్టమతంబుఁ దనరఁగా భారతాదర్శములుగ
అమృతభాష యనంగ నలరు సంస్కృతభాష భారతజాతీయభాష గాఁగ
దుస్సహదుర్ధర్ష దుర్మార్గ మగు శత్రుసమితి తనంతఁ దా సమసిపోవ
శ్రీమంత మగు పూర్వ రామరాజ్యంబుగా మనవారు మనలఁ బాలనము సేయ
అఖిలదుఃఖాదికంబులు సంతరింప–భరతలక్ష్మియు నూతనప్రభ గడించి
వఱలుఁ గావుత విఖ్యాతవైభవమున – సర్వతంత్ర స్వతంత్రయై యుర్వియందు.

మంచికో చెడ్డకో మన రాజ్యమును మనకిచ్చిపోయిన యాంగ్లనృపులఁ దలఁచి
కష్టమో సుఖమొ విఖండిత దేశపాలన కొప్పుకొన్నవారిని గణించి
మతమౌఢ్యమో లేక మతరక్షణభ్రమమో పెఱ్ఱులైన ద్రోహుల నడించి
కయ్యమో నెయ్యమో గమనింపఁజాలని మూర్ఖులకును దగు బుద్ధి చెప్పి
మరల స్వాతంత్ర్యదివసంబు మగిడి వచ్చు–లోపలనె రామరాజ్య సంస్థాపనమ్ము
నాయకాగ్రణు లొనరింప, నడచుఁ గాక – ధర్మ దేవత నలుగాల ధరణియందు.

భారతి పత్రిక సంపుటము 25 ఆగస్టు, 1948 సంచిక 8 నుండి తీసుకోబడినది.

ఆగష్టు పదిహేను

(కథానిక)

శ్రీ సహజానందం

సభా వేదిక వద్ద ధ్వజస్తంభం ఆకాశాన్ని అంటుతోంది. వేలమంది ప్రజలు శిఖరాగ్రం వైపు చూస్తున్నారు రెప్పలు వాల్చకుండా.

గాలి విసురుకు ఒక్కసారిగా జయ పతాకం ఎగిరింది. శతసహస్రజీవులు — పండితులు, పామరులు, నిరక్షర కుక్షులు జీవద్భాష నేర్చుకున్నారు. ధనవంతులకు దరిద్రులకు అక్షయమైన సంపద లభించింది.

స్వాతంత్ర్యం! జన్మభూమికి పునర్జన్మ!!

జనసముద్రంలో విజయోల్లాసం. జయ జయ ధ్వానాలు. ఆకాశమే జేగంటై మోగి, మార్మోగుతున్నట్టు, పృథ్వే పెదవులు విప్పి జయ ఘోష చేస్తున్నట్టు!

రత్న ఖచిత సింహాసనాలపై రాజాధిరాజులకు పట్టాభిషేకం జరిగిన దృశ్యం కాదు. దేశమే సింహాసనం. ప్రజలది ఆ సింహాసనం. ప్రజలే పాలకులు.

కిరీట మొకనిపై, దాస్యముద్ర ఇంకొకనిపై... ఆ యుగం అస్తమించింది.

లాఠీల మధ్య, తుపాకుల ముందు, ఉరితాళ్ళలో నెత్తురు గక్కి, అకాలమానుష మృత్యువుకు ఆహుతి ఐనారు అజ్ఞాతవీరు లనేకులు.

పతాకస్థాపన చేసిన నాయకుడు ప్రజల వైపు తిరిగాడు. జయధ్వానాలకు అతని కళ్ళు చెమ్మగిలినయ్. హృదయం స్పందించింది. గాత్రం గద్గదికమైంది. అతని కళ్ళముందెన్నో భయంకర దృశ్యాలు కదలిపోతున్నయ్. విప్పిన గాయంలా ఉంది స్మృతిపథం ! యుద్ధ భూమి కోలాహలం... తీవ్ర దైన్యం.. ప్రాణార్పణ చేసిన పుణ్యజీవు లతని స్మృతిపథంలో కళ్ళు తెఱిచారు.

హతవీరుల సమాధిపై పుష్పవర్షం కురుస్తోంది. ఒకరితర్వాత ఒకరు పూల మాలలు విసురుతున్నారు.. ఆహ్హా.. వారేరీ?

పంద్రెండేళ్ళప్పుడు తుపాకికి గుండె నిచ్చిన ఆ పసికందు... కన్నతల్లి ఏదీ? ఎక్కడ ? ఇప్పటి పుత్రోత్సవాన్ని మించిన ఆహ్లాదం తల్లి కెప్పుడు సిద్ధిస్తుంది?

యౌవనంలో పతివియోగం పొందిన ఆ యువతు లెక్కడ? దాంపత్యానికింత కంటే సాఫల్యం వేరేది? జీవితం యొక్క సంపూర్ణతను సిద్ధింప జేసికొన్న వారికి మృత్యువు లేదు. వారు చిరంజీవులు,

వయోభారంతో కుంగుతున్నా, అగ్ని గుండంలోకి దూకిన పెద్దలు నిత్యయౌవనులు! వీరిని దేశం మరువదు. ప్రజలు మరువరు. వీరే జాతికి అక్షరాభ్యాసం చేశారు.

వేదిక నుంచి వినబడుతున్న వీర గాథలకు ప్రజల హృదయాలు తల్లడిల్లినయ్.

లాఠీల మధ్య, తుపాకుల ముందు, ఉరితాళ్ళలో నెత్తురు గక్కి, అకాలమానుష మృత్యువుకు ఆహుతి ఐనారు అజ్ఞాతవీరు లనేకులు. కాని వారి సంకల్పం శ్మశానాగ్నిలో భస్మం కాలేదు. మరింత స్థిరమై, హింసాయుధాలను నిర్వీర్యపరచి, ప్రభుత్వ పీఠాన్నీ అధిరోహించి జయసిద్ధి పొందింది.

పీడనయొక్క నిష్ఫలత్వానికీ, మృత్యువు యొక్క అల్పత్వానికీ, సమర్పణ కున్న ప్రాణశక్తికీ ఇదే నిదర్శనం!

> **స్వాతంత్ర్యోత్సవం ముగిసింది. జనులు గృహోన్ముఖు లయ్యారు. నాయకులు ప్రజల ఆశీస్సునందుకొని వెళ్ళిపోయారు.**

సంకెళ్ళ మధ్య శుష్కించిన సంతతిలో ఈ అద్వితీయ సాహస మెక్కడిది ? ఈ సంకల్పశక్తి ఎక్కడిది? ఈ త్యాగతన్మయత ఎక్కడిది?

జననీ! గోడలు కూలి శిథిలమైంది ఇల్లు. దానమే ధర్మమైన జాతి చేతుల్లో ఇప్పుడు భిక్షాపాత్ర ఘోషిస్తోంది. అడుగడుక్కీ మృత్యువు అకాలంలో అగ్ని ద్వారాన్ని, నరకద్వారాన్ని తెఱుస్తోంది. సర్వత్రా దైన్యం అలముకొన్నది. కాని... కాని... ఈ అభాగ్యభూమిలో త్యాగశక్తి నశించలేదు. ఈ త్యాగమే, ఈ పూర్ణాహుతే, వధ్యశిలలపై స్రవించే రక్తమే సంజీవి! ఏ యుగాని కా యుగం ఒక మహాత్ముడుద్భవించి, తన త్యాగామృతంతో ఈ జాతికి జీవం పోస్తున్నాడు.

బాల్యమనక, యౌవనమనక, వార్ధక్యమనక త్యాగాగ్నిలో తప్తులైన జీవులు... వీరిని జాతి ఎలా మఱువగలదు? వీరే ఈ దైన్యభూమిలో కాలిడకపోయినచో, దాస్యపు కాష్ఠాగ్ని ఎప్పటికి చల్లారేది?

ప్రజల కళ్ళవెంట అశ్రుధారలు ప్రవహించినయ్. 'మీకు మనుష్యులు... ఈ దేశం మీది' అని రుజువు చేసిన వీరుల ఛాయలు శూన్యంలో తటిత్తున మెరిసినయ్.

వందలకు వందలు పూలమాలలు విసిరారు.

స్వాతంత్ర్యోత్సవం ముగిసింది. జనులు గృహోన్ముఖు లయ్యారు. నాయకులు ప్రజల ఆశీస్సునందుకొని వెళ్ళిపోయారు. వేదికపై దీపాలు ఆరినయ్.

చీకటి దట్టమైంది. ప్రజల జై జైలు దూరాన్నుంచి స్పష్టాస్పష్టంగా వినబడుతున్నయ్.

నిర్జన ప్రదేశంలో ఒక మూలనుంచి ఎవ్వరో... గుంపు సభా వేదిక వైపు వెళ్తున్నారు. వేదికపై బొమ్మలూ, సామగ్రీ తీసి సమకూర్చుతున్న కార్యనిర్వాహకుల్లో ఎవ్వరో యువకుడు ఆ గుంపుమీద టార్చిలైటు వేశాడు.

బెదిరి నిలబడిపోయారు గుంపు, చినిగిన పేలికలు... వికలాంగులు; దుమ్ముకొట్టుకొన్న నిర్జీవముఖాలు.

రోడ్లపక్కన బజారుకుక్కలను గెంటి, వాటి స్థానే కాపురం చేస్తున్న జీవరాశి.

"ఇక వెళ్ళండి. ఇళ్ళకు వెళ్ళండి" అన్నాడు వేదికమీది యువకుడు.

ఆ గుంపు ధ్వజస్తంభం పైకి చూస్తున్నారు. వికృతంగా 'జై' అని అఱిచారు.

ఒక్క క్షణం... ఎండు విస్తరాకుల మధ్య చెలరేగే ఆకలి యాతనను, చెత్త డబ్బాల పక్కన ఘూర్ణిల్లే మరణవేదనను మఱచి,

గుంపులోంచి శతవృద్ధు లిద్దరు ముందుకు వచ్చి, నలిగిన పూలమాలలను హతవీరుల సమాధిపై బెదురుతూ బెదురుతూ ఆన్చారు.

"ఇంక ఇళ్ళకు వెళ్ళండి" అన్నాడు వేదికమీది యువకుడు. అతని పరివారంలో ఒకడు ఓపక్కకు చూపించి, "అరిగో... అటు ... అటు... ఇంకా వస్తున్నారు" అన్నాడు.

మరొక గుంపు ఆ పక్కనుంచి వస్తున్నారు. యువకుడు మళ్ళీ టార్చిలైటు వేశాడు. అవే చినుగులు. అదే దుమ్ము. అవే నిర్జీవముఖాలు...

వేదికమీద నున్న కార్యనిర్వాహకులు సామగ్రిని సమకూర్చుకొని గృహోన్ముఖులై బయలు దేరారు. ధ్వజస్తంభం చుట్టూ, హతవీరుల సమాధిచుట్టూ 'మూగిన ' జనం శూన్యసభాస్థలి వైపు చూస్తున్నారు— దాతకేసి బిచ్చగాడు చూసినట్టు.

విన్న మహోపన్యాసాలు వాళ్ళ కర్థం కాలేదు. గాథలు చెప్పిన వీరులను వారెరుగరు.

కాని ఏదో అవ్యక్త ఆశ... తమ జీవన వేదన ఇక ఉపశమిస్తుందని. ఈ చినుగులు, మురికి, అజ్ఞానం ఇక ఉండవని... ఏదో అస్పష్టభ్రమ. జరిగిన కోలాహలంలో వా రేమేమో కలలు కన్నారు.

ఒక్క క్షణం... ఎండు విస్తరాకుల మధ్య చెలరేగే ఆకలి యాతనను, చెత్త డబ్బాల పక్కన ఘూర్ణిల్లే మరణవేదనను మఱచి, దుమ్ములోంచి తలలు పైకెత్తి, నక్షత్రాలకేసి చూశారు! తమ చీకటి అమావాస్య ఆకాశంలో వెన్నెల

పొర్లి ప్రవహిస్తోంది. నక్షత్రాలు మిరుమిట్లు గొల్పుతూ ప్రకాశిస్తున్నయ్.

కొత్తగా వచ్చిన గుంపులో కొందరు మాసిన పూలమాలలను పుచ్చుకొని బెదురుతూ నుంచున్నారు.

ఇళ్లకు బయలు దేరిన కార్యనిర్వాహకుల్లో ఒక వృద్ధు ధ్వజస్తంభంవద్ద ఆగి, ఈ నోరులేని జనసమూహాన్ని చూశాడు. వీరి శుష్క హృదయాల్లో ఏ సంకల్పం స్పందిస్తోంది? వీరి అల్పమనస్సుల్లో ఏ ఆలోచన పక్వమౌతోంది? వీరి మూగ గొంతుకల్లో ఏ భాష రూపం పొందుతోంది? వీరి వికృత నేత్రాలు ఏ ఉషస్సుకై రెప్పలు వాల్చకుండా చూస్తున్నయ్?

ఈ సూర్యోదయం మీకే! దేశపు అశ్రుధార మీరు... యుగాల నుంచి. ఇప్పుడే మీకు మానవజన్మ. ఇది మీ యుగం. ఈ స్వాతంత్ర్యం మీ ఐశ్వర్యం, ఇక మీరు యాచకులు కారు.

వాళ్లవైపు ఓ అడుగువేసి, “పూలమాలలను ఆ సమాధిమీద పెట్టండి” అన్నాడు వృద్ధు.

జనసమూహం అతని కేసి చూశారు. అతని కళ్లు చెమ్మగిలినయ్.

గంటక్రితం కోలాహలం, చప్పట్లు, ఉపన్యాసాలు, నినాదాలు, శబ్దయంత్రాల ఘోష... ఇళ్లవైపు తిరిగిన కార్ల సందడి... ఒక్కసారిగా అతనికి స్ఫురించినయ్. ఆ స్వాతంత్ర్యపూజ... ఉత్సవం... ఎంత సంరంభంతో జరిగింది ?

తరువాత... దీపాలు ఆరినయ్. శబ్దయంత్రాలు లేవు. కోలాహలం నిశ్శబ్దమైంది. మెల్లగా, బెదురుతూ బెదురుతూ చీకటి మూలల నుంచి వచ్చి, ఈ సంస్కార విహీనులు, పశుప్రాయులు దుమ్ముగొట్టుకున్న పూలమాలలను హతవీరుల సమాధిపై పెట్టారు. వికృతంగా జయధ్వానాలు చేశారు.

ఆ శతవృద్ధు దుఃఖంతో కంపించాడు.

“ఈ సూర్యోదయం మీకే! దేశపు అశ్రుధార మీరు... యుగాల నుంచి. ఇప్పుడే మీకు మానవజన్మ. ఇది మీ యుగం. ఈ స్వాతంత్ర్యం మీ ఐశ్వర్యం, ఇక మీరు యాచకులు కారు. యజమానులు. ఇందుకోసమే వందలు, వేలు ప్రాణదానం చేశారు. స్వాతంత్ర్యం మీ ఐశ్వర్యం” అన్నాడు.

అయోమయమైన దృష్టులతో జనం అతని మాటలను విన్నారు. అతని గాత్రంలోని గద్గదికకు, అతని కళ్లలోని అశ్రువులకు వారి హృదయాలు స్పందించినయ్. అతని ప్రబోధం, అతని మాటలు ఆకాశంలో తోకచుక్కల్లా, తటిత్తువలె దూసుకుపోయినయ్ ——వారి మనస్సుల్లో. అతని భాష వారి కర్థం కాలేదు. కాని అతని మాటల్లో ఏదో వెలుగు ప్రసరిస్తున్నట్టు తోచింది.

వృద్ధూ, కార్యనిర్వాహకులూ అక్కడ నుంచి వెళ్లిపోతున్నారు. వెనక్కు తిరిగి ఎవరో కేక వేశారు. “ఇంకా ఇక్కడ ఎందుకు? మీ ఇళ్లకు మీరు వెళ్లండి.”

జనం అక్కడనుంచి కదలలేదు. ఈ బహిరంగ నిర్జన ప్రదేశం... ఆశా భూమిని వారు విడిచిపెట్టలేదు. ఇళ్ళు? వాళ్ళకు? ఎక్కడ?...’ధర సింహాసనమై, నభంబు గొడుగై..’ అహ్హా వా రిక ఆ, ఆ రోడ్ల దుమ్ములోకి వెళ్లదలుచుకోలేదు. ముసలి మాటలు మధుర సంగీతంలా, భజనగీతంలా వారి అంతరాళాల్లో ఝుంకారం చేస్తున్నయ్.

కొంత సేపు క్రితం విన్న పాటలు, కీర్తనలు, ఉపన్యాసాలు, వీరగాథలు, జయ జయ ధ్వానాలు ఆలాపనగా వినబడుతున్నయ్.

భారతి పత్రిక సంపుటము 25 ఆగస్టు, 1948 సంచిక 8 నుండి తీసుకోబడినది.

మానవతావాది గురజాడ

డా. భమిడిపాటి గౌరీశంకర్
94928 56395

తెలుగులో నవ్యరీతులకు నూతన ప్రమాణాలకు ప్రయత్నించిన మొదటి కవిని నేనే, నా కావ్య కళా నవీనం. కావ్య ఇతివృత్తాలు భారతీయం. కవితలో నేను ఉత్తమ ప్రయోజనాలను ఉపలక్షించాను. జీవితాన్ని నూతన దృక్పథంతో దర్శించి కథా కవితా రూపంలో దాని తత్వాన్ని అన్వయించడానికి ప్రయత్నించాను' అని తానే స్వయంగా అదిభట్ల నారాయణదాసు గారు రాసిన (1909) ఉత్తరంలో చెప్పుకున్నారు. గురజాడ అప్పారావు గారు 'భోగం పిల్లలో కూడా మానవత్వాన్ని చూడగలిగిన 'రచయిత'.

గురజాడ రచనలు నిత్యనూతనాలు, వాటికి 'అక్షరం' శాశ్వతత్వం కల్పించాయి. అక్షరం వెనుక అన్యస్యమైన మానవతా విలువలు, రాజకీయ, సామాజిక, ఆర్థిక సంస్కరణల సంస్కర్త హృదయం కనిపిస్తుంది. వర్తమాన సమాజం 'వస్తువల'కు ఇస్తున్న ప్రాధాన్యత వ్యక్తులకు ఇవ్వటం లేదు. 'దేశమంటే మనుషులోయ్' అనే వ్యాఖ్యానానికి విపరీతార్థాలు 'వ్యవస్థ'కు అలవాటయిపోయింది. 'మంచితనం' 'మనిషితనం' మానవత్వపు విలువలు 'మానవతావాదం' అనేవి నిఘంటువుల్లో శబ్దాలుగా మిగిలిపోతున్న వర్తమానంలో గురజాడ రచనలను పరిచయం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

కవి కాలం కన్నా ముందుంటాడు. రవి కాంచినది కవి చూస్తాడు. ఈనాటి సమాజ స్థితిలో మంచి, సత్యం, ధర్మం, నీతి వంటి విలువలుకు అర్థాలు వెతుక్కోవలసిన స్థితి ఉంది. వ్రేళ్ళ మధ్య నుంచి ప్రపంచాన్ని దర్శిస్తున్న వర్తమాన తరానికి, వారికి దిశానిర్దేశం చేస్తున్న వ్యాపారాత్మక విద్యా సంస్థలు రూపొందించే 'సిలబస్' ఉపాధి కోసమే తప్ప 'విలువలు' నేర్చుకోనేందుకు కాదని బోధిస్తున్నాయి, ' నీతి కథలు చెప్పుకొనే సమయం పోయి 'హరిపోర్టర్' లోని అద్భుత ప్రపంచాలను రాత్రి వేళలో దుప్పటి ముసుగులో దర్శించే తరానికి గురజాడ చెప్పిన అక్షర సత్యాలులోని నైతిక, మానవ విలువలు గుర్తు చేసే వారేది?

'తోక చుక్క' వెనుక అశాస్త్రీయతను కాదని శాస్త్రీయతను విశ్వసించమని చెబుతారు గురజాడ.

గురజాడ అప్పారావు (క్రీ.శ 1862 – 1915) తన కాలం కంటే శతాబ్దం ముందు కాలాన్ని ఊహించే 'ద్రష్ట' 'సాహిత్య కళకు' మానవతను సంస్కరణాభిలాషలో అభ్యుదయ సంధాలో అక్షరబద్ధం చేసాడు. ఆయన ప్రతీ రచనలో అద్భుతమైన మానవీయ విలువలు చిత్రణ కనిపిస్తుంది. సంఘ సంస్కరణ అంటే 'మనిషి'ని మార్చటం అనేది ఆయన రచనల్లోని అంతస్సూత్రంగా కనిపిస్తుంది. గురజాడ రచించిన 'ముత్యాలు సరాలు', మొదటి మూడు చరణాలలో 7+7 మాత్రల గణాలలో (14 గణాలు) పంక్తులు, 4 పాదంలో 9 మాత్రలుంటాయి. వర్ణ వ్యవస్థ అస్పృశ్యతకు వ్యతిరేకంగా వ్రాసిన గేయం.

మూఢాచారాల ముసుగులో మానవత్వం మంట గలిపిన సంఘటనలనేకం నిత్యం చూస్తున్నవే. గుప్త నిధుల కోసం, కాముకత్వం కోసం ఇలా ఎన్నెన్నో ఉదాహరణలు మంచి, సత్యం, ధర్మం, నీతి వంటి వాటిని విస్మరిస్తున్నవే విస్మయ పరుస్తున్నవే. గురజాడ వాటి వెనుక రాసిన అర్థాన్ని భావాన్ని అర్థం చేసుకోలేని వారు నేటికి ఉన్నారనటంలో అతిశయోక్తి లేదు. 'తోక చుక్క' వెనుక అశాస్త్రీయతను కాదని శాస్త్రీయతను విశ్వసించమని చెబుతారు గురజాడ. పాత విషయాలను క్రొత్తగా నేర్చుకోవలసిన ఆవశ్యకతను నొక్కి చెబుతారు. అక్షరాలను ఆయుధాలుగా మలచినవారు లేరు అద్భుతం.

గుత్తునా ముత్యాల సరములు
కూర్చుకొని తేటైన మాటల,
కొత్త పాతల మేలు కలయిక
క్రొమ్మెరుంగులు నమ్మగా

మానవత్వం
'మనిషి-మనిషిని'
దగ్గర జేర్చాలి,
మతాలన్ని
ఇదే సుత్రాన్ని
వివరిస్తున్నాయి.

పాత క్రొత్తల మేలు కలయిక సమాజంలో అనివార్యమని చెబుతారు. 'మంచి గతమున కొంచమేనోయ్' అని పాత వరుసల నిరసనను కాదని, 'మంచి గతమునా కలదనే' క్రొత్త పల్లవులు అవసరమని చెబుతారు. మానవత్వపు నీడను ఏవగించుకొనే 'విద్య' ప్రస్తుతం సమాజంలో ఉంది. 'మనం' దగ్గర ప్రారంభం కావలసిన వ్యక్తి వ్యవస్థ 'నాది నేను!. దగ్గరనే ప్రారంభ, ముగింపులను ఆపేస్తున్న వర్తమాన తరానికి కారణం 'విద్య', ప్రతీ అంశాన్ని తరచి, తరచి చూడవలసిన విశ్లేషణ చేసుకోవలసిన అవసరం ఉంది.

కోట పేటలు నేలగలరని
కోటి విద్యలు మీకు కరపిరి
పొట్ట కూటికి నేర్చు విద్యలు
పుట్టకిట్లు కదల్చేనా....?

మానవత్వం 'మనిషి-మనిషిని' దగ్గర జేర్చాలి, మతాలన్ని ఇదే సుత్రాన్ని వివరిస్తున్నాయి. అయినా ఎవరికి వారే సాటి మనిషి పట్ల కనీసపు జాలి, దయలను విస్మరించటం శోచనీయం. వాటిని వదిలిపెట్టాలని చెబుతాడు గురజాడ.

యెల్లలోకము వొక్క యిల్లై
వర్ణ భేరములెల్ల కల్లై
వేల నెరుగని ప్రేమ బంధము
వేడుకలు కురియ

మతాల సారం కన్నా మానవత్వపు' దూరం నిరసించదగినది, కాని మనిషి స్వార్థంతో 'మానవీయ విలువలు'ను వదిలేస్తున్న వ్యవస్థ వర్తమానంలో ఉంది కాని.. జ్ఞానంతో కూడిన చదువు నేర్పితే వర్తమాన భావితరాల వారు మతాలను నిరసించకుండనే 'మనీషిలుగా ఎదిగే అవకాశాలున్నాయి.

మతములన్నియు మాసిపోవును
జ్ఞానమొక్కటే నిలిచి వెలుగును,
అంత స్వర్ణసుఖంబులన్నవి
యవనీవిలసిల్లున్

తల్లిదండ్రులు లేనిదే పిల్లలు లేరనే ఇంగితం మరుస్తున్న యువత పెళ్ళికాగానే తల్లిదండ్రుల బాధ్యతను వదిలించు కుంటున్నారు.

వర్తమానంలో తల్లిదండ్రుల పట్ల అమానవీయ వైఖరి ప్రదర్శిస్తున్న 'వ్యక్తుల సమూహం'ను నిత్యం చూస్తూనే ఉంటున్నాం. ఆస్తుల కోసం తల్లిదండ్రులను చంపేసినవారు, వారు వృద్ధాప్యంలో ఉంటే సేవ చేయలేని పిల్లలు (స్త్రీ, పురుషులు) వారిని శ్మశానంలో వదిలి పెడుతున్న దైన్య చిత్రాలు మీడియాలో చూస్తున్నాం. మతాలు... మత గ్రంధాలు, మత పెద్దలు, వంటి వారు కూడా ఎంతో మంది ఇదే త్రోవన పోవటం విచారించవలసిన విషయం. దీనిని నిరసించిన గురజాడ తన 'ముత్యాల సరములు'లో

కుట్టుకున్నది యేమికానీ
పెట్టి పొయ్యక పోతే, పోనీ,
కాంచి పెంచిన తల్లిదండ్రుల
నైన కనవలదో అని నినాదిస్తారు.

తల్లిదండ్రులు లేనిదే పిల్లలు లేరనే ఇంగితం మరుస్తున్న యువత పెళ్ళికాగానే తల్లిదండ్రుల బాధ్యతను వదిలించుకుంటున్నారు. సంఘసంస్కర్తలు నేటికి అవసరమే అనిపిస్తుంది. వ్యవస్థ మారాలంటే వ్యక్తుల్లో మార్పు అనివార్యం, మాటలతో మానవీయ విలువలపై దాడి చేస్తున్న వ్యక్తులు సమూహాలు కూడా కొన్ని ఉన్నాయి. వారి లక్ష్యం 'మానవతావాదం' కాదు 'మనీతత్వం' సంపదలు వలన సంసారాలు బంధాలు సఖ్యంగా సాగుతాయని భ్రమించే నైజం.

చూడు మునుమును మేటి వారల
మాటలనియెడి మంత్ర మహిమను
జాతి బంధములన్న గొలుసులు
జారీ, సంపదలుచ్చెడన్

మనుషుల మధ్య సఖ్యతకు 'ఐక్యత' అవసరం, సుఖం, శాంతి, ధర్మం, ప్రేమ, నీతి వంటివి ఉపన్యాసాలు వలన రాదు. స్వతహాగా నేర్చుకోవాలి,

అందరిని కలుపుకు పోవటం పేరు. అందరితో 'కలిసిపోవటం' వేరు. కౌగిలింతలు వలన మనసుల్లోని 'కఠినత్వం' కరిగిపోరు. అంటరానితనం రూపుమాపమని కొన్ని శతాబ్దాలుగా 'సామాజిక సమరం' జరుగుతున్నా, తాత్కాలికమైన 'మార్పు' వచ్చినా 'పరువు హత్యలు' ఆగిపోయాయా.... 'అంటరానితనం' అనేది మనుషులకే కాదు వారి 'మనసులకు' కూడా అంటుకు పోయింది. దాని వదిలించుకోవాలని గురజాడ

కవి, రచయిత, కళాకారుడు మనిషి ఆత్మను తీర్చిదిద్దే 'ఇంజనీరు' అటువంటి గొప్ప 'మానవతావాది' గురజాడ.

కలసి మెసగిన యంత మాత్రనె
కలుగుబోదీ యైకమత్యము
మాల మాదిగ కన్నెనెవతెనో
మరులు కొన్న రాదో...

'కన్యక' 'పూర్ణమ్మ' 'కాసులు' వంటి రచనల్లో కూడా గురజాడ వారు తన మానవతావాదాన్ని విశ్వరూపాన్ని ప్రదర్శించారు.

ప్రేమ నిచ్చిన ప్రేమ వచ్చును.
ప్రేమ నిలిపిన ప్రేమ నిలుచును....
ఇది గురజాడ ప్రేమతత్వం.

కవి, రచయిత, కళాకారుడు మనిషి ఆత్మను తీర్చిదిద్దే 'ఇంజనీరు' అటువంటి గొప్ప 'మానవతావాది' గురజాడ.

వర్తమాన తరంలో ప్రాథమిక స్థాయి నుంచి స్నాతకోత్తర స్థాయి చదువుల వరకు గురజాడ రచనలను "సిలబస్'లో భాగం చేస్తే... గొప్ప సంఘ సంస్కరణకు పునాదులు పడినట్టే... ఆ రోజు కోసం వేచి చూడవలసిందే....

బంజారాల బ్రతుకు చిత్రాలు

డా. మంత్రి శ్రీనివాస్
8328333720/9550945096

భారతీయ గిరిజన జాతుల్లో బంజారా జాతి ప్రసిద్ధమైనది. సింధూ నాగరికత నాటి నుండి తమ ఆనవాళ్లను కనబరుస్తూ ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన అతి ప్రాచీన జాతిగా బంజారా జాతి విఖ్యాతమైంది. జిప్సిలుగా చెప్పబడుతూ వివిధ దేశాలలో తమదైన అస్తిత్వాన్ని కలిగి ఉన్నారు. చరిత్రలో చోటుచేసుకున్న కొన్ని యుద్ధాల కారణంగా రాజాస్థానానికి దూరమై వనాలలో మనుగడను నిలుపుకున్న వారిగా నేటికి తమ సంస్కృతి, సంప్రదాయ వైభవాన్ని సజీవంగా ఉంచుతున్నారు. ఇంతటి ప్రసిద్ధత కలిగిన బంజారాలు ఈ క్రమంలో ఎన్నో కష్టాలను, కడగండ్లను ఎదుర్కొన్నారు. కాలంతో పాటు తమను తాము

వనవాసులుగా వనాలలో జీవితాన్ని వెలిగించుకున్న వేగుచుక్కలుగా బంజారా సమాజాన్ని చిత్రిక పడుతుంది ఈ నానీ.

రూపొందించుకున్నారు. వారి జీవన లోలోతులను, సౌందర్యాన్ని, వ్యతలను, సాంస్కృతిక సంపదను, జాతి అస్తిత్వాన్ని అక్షరాలుగా గుమ్మరించి 'బంజారా నానీలుగా' ప్రభవింపజేసిన రచయిత్రి, విదుషీమణి డా.సూర్యాధనంజయ్. తాను పుట్టిన బంజారా జాతి దుఃఖాలను, సాంఘిక, కుటుంబ జీవనాన్ని, బ్రతుకుతో పోరాటం చేస్తూ జీవిక సాగిస్తున్న విధాన్ని, సంస్కృతిలోని వైవిధ్యతను, అందాన్ని తమ నానీలుగా కురిపించారు. వారి నానీలలో దాగున్న బంజారాల బ్రతుకు నాడిని పట్టి తండాల్లోకి ప్రయాణిద్దాం.

నూట ముప్పై ఎనిమిది నానీలున్న ఈ గ్రంథంపు మొదటి నానీనుండే వన పరిమళం గుప్పుగుప్పుమని యద పొరల్లోకి దూసుకుపోతుంది. బంజారాల సంస్కృతి, కళలు, ఆహారాది వస్త్రాభూషణాదులు, బ్రతుకు, ధిక్కార పోరాటాలు, పేదరికం, వలసలు, వ్యవసాయ సంస్కృతి, పట్టణీకరణ, ప్రపంచీకరణ ప్రభావం కారణంగా చతికిలబడ్డ వారి జీవితాలు కళ్ళముందు కదలాడుతాయి. పరికిస్తే...

"బంజారాలు
వనచరులే
అందుకే వారి మాటల్లో
అడవి పరిమళం"

అంటూ వనవాసులుగా వనాలలో జీవితాన్ని వెలిగించుకున్న వేగుచుక్కలుగా బంజారా సమాజాన్ని చిత్రిక పడుతుంది ఈ నానీ. కొండలు, కోనలు తిరుగుతూ అడవిలోనే నాగరికత పురుడుపోసుకొని మైదానాల్లోకి ప్రయాణం చేసిందన్న నిజాన్ని ఈ నానీ వ్యక్తపరుస్తుంది. ఆదిమ సమాజాలు మనిషి అస్తిత్వ రేఖలుగా, విభజనలు లేని స్వచ్ఛమైన సమాజాన్ని పాఠకుల ముందు ఆవిష్కరిస్తుంది. పలుకు పలుకులో తడి తడిగా అడవి వికసిస్తుందని పచ్చటి మోదుగు కొమ్మల మీద ఎర్రని మోదుగ పువ్వులను పూయిస్తుంది. పురాతత్వ విభాగాల అంచుల దాకా నడిపించి ఆది మానవుడి నుండి ఆధునిక మానవుడి దాకా చరిత్రను వల్లె వేయిస్తుంది.

"మా అమ్మా నాన్నలు
మట్టి మనుషులు
అందుకే మా ప్రేమల్లో
ఇంత గట్టిదనం"

రంగురంగుల వస్త్రాలను పూలమాలలుగా పేర్చి వాటిపై అద్దాల పువ్వుల్ని పొదిగే అపురూప చేనేతకళ

అంటూ మట్టిని నమ్ముకొని పోడు వ్యవసాయాన్ని చేసుకుంటూ మనుగడ సాధించడమే కాదు రేపటి తరాలకు కుటుంబ జీవన సారాన్ని అందిస్తుంది. ప్రేమాప్యాయతలతో పాటు ఒకరి కోసం ఒకరుగా సమూహ జీవన బలాన్ని అందించిన పెద్దల మనో బలాన్ని ప్రసాదిస్తుంది. మట్టి పొరల్లోకి తీసుకెళ్లి గతకాలపు స్మృతుల్లో పదిలంగా ఉన్న జ్ఞాపకాలను దృశ్యమానం చేస్తుంది.

"గగనానికి లంబాడీలు
ఘాగరా అతికించారు
ఇంద్రధనుస్సంటే
అదే…."

అంటూ రాజాస్థానానికి దూరమై పచ్చటి వనాలలో మనుగడ సాగిస్తున్నా తమ పురాతన సంప్రదాయ వస్త్రధారణను, కళంకారి నైపుణ్యాన్ని ఈ నానీ గుండెలకు అద్దుతుంది. రంగురంగుల వస్త్రాలను పూలమాలలుగా పేర్చి వాటిపై అద్దాల పువ్వుల్ని పొదిగే అపురూప చేనేతకళ బంజారాలది. వారు నడుస్తుంటే నిజంగానే ఇంద్రధనుస్సు ఇలపై దిగినట్టు ఉంటుంది. చమక్కున మెరిసే అద్దాల వెలుగులో సూర్యుడు సహితం చిన్నబోతాడు. అటువంటి వస్త్రనిర్మాణ నిపుణతను ఈ నానీ పట్టిస్తుంది. ఇదే భావాన్ని గుమ్మరిస్తూ

"ఆమె కదిలొచ్చే
కళాఖండం
ఆ డ్రస్సు కుట్టిన
యాడిని మొక్కాలి"

అంటూ మరో నానీ అక్షరాల తాడై అల్లుకుంటుంది. ఆకాశానికి అనేక అద్దాలు అలంకరించినట్టు చూపరులను స్థాణువులుగా చేసే అద్భుత దృశ్యాలను

"ఆమె ముందు
అలా నిలబడిపోయావా
చమ్కీ అద్దాల్లో
అనేక ముఖాలు"

అంటూ పాఠకుడిని ఎక్కడి కక్కడే కట్టిపడేస్తారు రచయిత్రి.

బంజారా సంప్రదాయ వంటకాలలో లాప్సి అనేది ఒక తియ్యని వంటకం. బలవర్ధకమైనది.

తండా జీవన సౌందర్యంలో ఆహారాది వ్యంజనాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంటాయి. ఒక్కోసారి అవి వారి బ్రతుకు వ్యతలను కూడా పాఠకులతో పంచుకుంటాయి. ముఖ్యంగా...

"ఆ సువాసన
ఎక్కడినుంచో తెలుసా
మా యాడి తొక్కునూరే
రోటీలోంచి....."

అంటూ అమ్మ నూరే తొక్కు వెదజల్లే సుగంధాన్ని మనకూ పంచుతారు రచయిత్రి. పేదరికాన్ని గుండెల్లో దాచుకొని అడవిలో దొరికే కాయలు, దుంపలతో తొక్కు నూరి కడుపు నింపుకునే విదారక దృశ్యం కూడా అంతర్లీనంగా ఈ నానీ గర్భీకరించుకున్నదిగా అనిపిస్తుంది.

"పెప్పీలెందుకు
పనికొస్తాయి
యాడి వండి పెట్టిన
లాప్సీముందు..."

బంజారా సంప్రదాయ వంటకాలలో లాప్సి అనేది ఒక తియ్యని వంటకం. బలవర్ధకమైనది. పాలు, నెయ్యి, కొబ్బరి, బియ్యంతో పాటు మిగితా దినుసులతో కలిపి చేసే ఈ వంటకం తిన్నవారికి అమృతమే. చేతి వేళ్ళు నాకుతూ ఉండిపోతారు. లాప్సి పండుగలప్పుడు ప్రత్యేకం అని చెప్పుకోవాలి. ఈ లాప్సి తియ్యదనాన్ని మనందరికీ మోదుగు ఆకులలో కొసరి కొసరి వడ్డిస్తారు రచయిత్రి.

జొన్నరొట్టెలు బంజారాల దైనందిన జీవనంలో నిత్యం ఉండేవి. రొట్టెపై పచ్చటి కూరలతో తింటే ఏ వంటకం దానికి సరిరాదు. స్వర్గం అరచేతి మందం దూరంలో ఉందనిపిస్తుంది. అదే విషయాన్ని చెబుతూ

"బాటి భాజీల రుచి
స్వర్గానికి బెత్తెడు
అందులో యాడి ప్రేమ
చారెడు..."

అంటూ జ్వారేర్ బాటీపై పచ్చగూరల కమ్మదనాన్ని నానీల రొట్టెపై మనకు వడ్డిస్తారు.

బతుకును వెతుక్కుంటూ దేశవ్యాప్తంగా విస్తరించిన బంజారాల బతుకులలో మొదటినుండి వ్యతలే దర్శనమిస్తాయి.

బతుకును వెతుక్కుంటూ దేశవ్యాప్తంగా విస్తరించిన బంజారాల బతుకులలో మొదటినుండి వ్యతలే దర్శనమిస్తాయి. తమ స్వస్థానాన్ని వీడి మూలాలను మోసుకుంటూ పయనించే బంజారాలు బతకడానికి నిత్యం పోరాటం చేస్తూనే ఉంటారు. నేడైతే పేదరికం కోరల్లో ఇరుక్కుని తమది కానీ ప్రదేశాలకు, పట్టణాలకు వలసపోతున్నారు. తమ సంస్కృతిని కాపాడుకుంటూనే ప్రపంచీకరణ ప్రభావానికి తామూ గురవుతున్నారు. అటువంటి దయనీయ స్థితిని

"ప్రపంచీకరణం
దేనినీ వదల్లేదు
ఆఖరికి
తండా సంస్కృతిని కూడా"

అంటూ సంస్కృతీ క్రమక్షయానికి కారణమవుతున్న ప్రపంచీకరణను ధిక్కరిస్తారు. వెనువెంటనే

"తండాల్లో
జొన్నరొట్టెలు మాయం
ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో
వెదకండి"

అంటూ తమ జీవికకు విఘాతంగా ఉన్న రాజ్య పరిస్థితులను, ప్రతీ వస్తువునూ...ఆఖరుకు ఆహారాన్ని కూడా వ్యాపారీకరణం చేస్తున్న

విషవలయాన్ని ఎండగడతారు.

"పుట్టింది పెరిగింది
కొండకోనల్లో
బతుకు బండి లాగేది
బస్తీల్లో"

అంటూ దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న బంజారాల బతుకుల మాటున దాగిన అతుకులను మనముందు ఉంచుతారు. ఆఖరుకు వారి ఆట పాటలు కూడా పట్టణీకరణ, ప్రపంచీకరణ ప్రభావానికి గురవుతున్న వాస్తవాన్ని చెబుతూ

"బంజారాల
పాట బాట తప్పింది
పట్టణీకరణ అనే
అరణ్యంలో"

అంటూ ఈనాటి వాస్తవ పరిస్థితులను నిర్భయంగా వివరిస్తారు.

స్థిర నివాసం అన్నది ప్రతీ మనిషికి ధైర్యాన్ని, జీవన స్థిరత్వాన్ని అందిస్తుంది. అటువంటిది ఆ నివాసమే పరుల పాలైతే ఆ స్థితి మరింత దీనంగా ఉంటుంది. అటువంటి స్థితి బంజారాల జీవనంలోనూ చోటుచేసుకుంది. ఒకనాడు వలసలలో భాగంగా కార్వాన్ సిస్టంతో దేశసేవ చేసిన బంజారాలకు నైజాం రాజుల ద్వారా లభించిన నివాస స్థలాలు రియల్టర్ల మోసాలకు కోల్పోవడం జరిగింది. ఆ వైనాన్ని వివరిస్తూ...

స్థిర నివాసం అన్నది ప్రతీ మనిషికి ధైర్యాన్ని, జీవన స్థిరత్వాన్ని అందిస్తుంది. అటువంటిది ఆ నివాసమే పరుల పాలైతే ఆ స్థితి మరింత దీనంగా ఉంటుంది.

"ఆ తండాలో
కొండగాలి లేదు
బంజారా హిల్స్ లో
బంజారాలు లేనట్టు..."

అంటూ వాస్తవాన్ని లోకగతం చేస్తారు.

పేదరికపు విషవలయంలో చిక్కుకొని బయటకు రాలేక పుట్టిన బిడ్డల్ని సహితం అమ్ముకునే దుస్థితిని...

"నోట్లో సారా చుక్కేసి
ఆడ శిశువును చంపేస్తారా
తండాలకూ
గుండెలేదా...."

అంటారు. ఈ నానీ చదివిన వారి గుండెలు చెరువులవ్వడం ఖాయమని చెప్పవచ్చు. హృదయాన్ని పిండేసే ఈ సంఘటనలు చదువరులను స్థాణువులుగా చేస్తాయి.

ఈ నానీ బంజారాల బతుకుల్లో దాగిన పేదరికమనే చీకటి చిక్కులను వ్యక్తం చేస్తుంది.

అటువంటిదే మరొక నానీ

"ఆడపిల్ల
అమ్మకు బరువైంది
పేదరికం
ఎంత పని చేయించింది..."

ఈ నానీ బంజారాల బతుకుల్లో దాగిన పేదరికమనే చీకటి చిక్కులను వ్యక్తం చేస్తుంది.

జీవితాన్ని వెతుక్కుంటూ తండా దాటి నగరాలకు వలసలు పోతున్న బంజారాలు అటు తండాకు దూరం కాలేక నగరంలో ఇమడలేక నలిగిపోతున్న స్థితిని

" నగరంలో
ఒంటరైపోయాను
అడవిలోంచి
జూలోకి..."

అంటూ స్వేచ్ఛగా తండాలో తిరిగే ఆడబిడ్డలు పట్టణాలలో ఎవరికీ ఎవరూ కానీ సమాజంలో తమను తాము ఒదిగించుకోలేక మానసిక వేదనను, అనుభవించిన ఒంటరితనాన్ని ఈ నానీలో చెబుతారు. మెట్రోపాలిటన్ సిటీస్ లో ఇమడలేని బంజారా మహిళల మనోస్థితిని మనముందుంచుతారు రచయిత్రి.

మరొక నానీలో

"బాయీ!
ముంబై గాలి తన్నుకుపోయిందా
అడవి పుష్పమా!
నా బంజారా భాష్పమా..."

అంటూ "చేతినిండా పని దొరుకుతుంది. గొప్పవారి ఇండ్లలో పని ఇప్పిస్తాం. పైసలు బాగా దొరుకుతాయి..." అంటూ పేద బంజారా స్త్రీలను నమ్మించి ముంబై, కోల్ కత్తా వంటి నగరాలకు తీసుకెళ్లి వ్యభిచార కుపాల్లో ఇరికించిన,ఇరికిస్తున్న మోసగాళ్ల మోసాలను, ఆ కూపాల్లో ఇరుక్కుని మోసపోయిన మహిళల దుస్థితిని నాలుగు పంక్తులలో మనముందు ఉంచుతారు రచయిత్రి. ఈ నానీ చదివాక కండ్లు సముద్రాలవుతాయి.

కరువు పరిస్థితులు, నిరుద్యోగం, పని దొరకని పరిస్థితి, పైపెచ్చు పనిచ్చినచోట జాతి పరంగా ఒకరకమైన అవమానం.

పేదరికంతో పాటు నిరుద్యోగం అనేది ఒకనాడు తెలంగాణను పీడించిన భూతం. నేటికి ఆ స్థితి కనబడుతూనే ఉన్నది. ఆ స్థితిని వివరిస్తూ...

"తండాలకు
తడికెలు పడ్డాయి
పాపం గిరిజనులు
వలస కాకులు..."

అంటూ తండాలకు తండాలు బతుకుదెరువుకోసం వలసలు పోయిన వైనాన్ని చిత్రిస్తారు. కరువు పరిస్థితులు, నిరుద్యోగం, పని దొరకని పరిస్థితి, పైపెచ్చు పనిచ్చినచోట జాతి పరంగా ఒకరకమైన అవమానం. ఇవన్నీ తట్టుకోలేక పచ్చటి అడవిని వీడి కాంక్రీటు వనాల్లోకి పయనం సాగించిన సంఘటనలను దృశ్యాలుగా కళ్ళకు కడతారు.

బంజారాలు అస్తిత్వ పోరాటాలలో ఎప్పుడూ ముందుంటారనే సత్యాన్ని వెలిబుచ్చుతూ భారత స్వాతంత్ర్య సమరంలోనూ, తెలంగాణ రైతాంగ పోరాటం, తొలి, మలి దశ రాష్ట్ర సాధన ఉద్యమంలోనూ తమదైన భూమికను పోషించారన్న వాస్తవాన్ని చెబుతూ

"రజాకార్లను
వణికించిన సోమ్లా!
జనగామ వీరుడా!
ఓ త్యాగధనుడా..."

అంటూ రైతాంగ పోరాట కాలంలో బంజారాల తెగువను, భూమికోసం, భుక్తి కోసం వారు చేసిన ప్రాణ త్యాగాలను గుర్తుచేసుకుంటారు. ఈ నానీ విన్నవారికి రాను నాయక్, దర్గ్యా నాయక్, పూలి బాయి, ధర్మీబాయి వంటి పోరాట వీరుల త్యాగాలు మదిలో మెదులుతాయి. దొరలను, రజాకార్లను ఎదిరించిన వారి ధైర్య సాహసాలు పాఠకులను కదిలిస్తాయి.

ఒకనాటి తమ రాజకీయ అస్తిత్వానికి దూరమైనా నేటికి ఆ వీర పౌరుషం తమ కణకణంలో ఇంకా ప్రజ్వరిల్లుతూనే ఉందన్న సత్యాన్ని వెలిబుచ్చుతారు.

"భోజ్యానాయక్
తెలంగాణ బిడ్డ
నీ ముందు నిలవదు
ఏ తూటా!..."

అంటూ మలిదశ తెలంగాణ ఉద్యమంలో అరివీర పోరాటం చేసిన భోజ్యా, ప్రవీణ్ నాయక్ వంటి వీరుల పోరాటాలు ముందుంచుతారు.

బంజారాల ప్రాచీన చారిత్రక వైభవాన్ని వివరిస్తూనే తమ సాంస్కృతిక వైభవాన్ని, వారు నివసిస్తున్న తండాల అందాన్ని, అక్కడ నిత్యం చెట్టుపుట్టగుట్టలతో చేసే సహవాసం గురించి, వాటితో పెనవేసుకుపోయిన అనుబంధాన్ని గురించి హృద్యంగా వివరిస్తూ...

"వారసత్వం దర్జా
పృథ్వీరాజ్ దే
పేదరికం ముందు
అది బలాదూర్..."

అంటూ ఒకనాటి తమ రాజకీయ అస్తిత్వానికి దూరమైనా నేటికి ఆ వీర పౌరుషం తమ కణకణంలో ఇంకా ప్రజ్వరిల్లుతూనే ఉందన్న సత్యాన్ని వెలిబుచ్చుతారు. పేదరికం ఎంత బాధపెట్టినా తమ సగౌరవ చరిత్రకు,

సంస్కృతికి ఎటువంటి భంగం వాటిల్లకుండా చూసుకుంటామన్న బంజారాల తెగువను పరిచయం చేస్తారు.

"వారి చరిత్ర
ఎంతో ఘనమైనది
ఏ మహాకవి
దృష్టి పడాలో..."

అంటూ చరిత్రకెక్కని చరితార్థుల వీర గాథలను వల్లెవెయిస్తారు. మౌఖికంగా నేటికి ప్రచలితంలో ఉన్న బంజారాల చరిత్రను నమోదు చేసే ఆవశ్యకతను గుర్తుచేస్తారు. గత చరిత్రను, నేటి పరిస్థితిని విడమరిచి చెబుతూ భారత దేశంపై దండయాత్రలు చేసిన పరదేశీయులను తరిమి దేశ స్వాతంత్ర్య సౌభాగ్యాన్ని కాపాడిన బంజారాలు నేడు ఎంతటి దీనావస్థలో ఉన్నారో పాఠకుల పాఠకులకు ఎరుకపరుస్తూ...

భారత దేశంపై దండయాత్రలు చేసిన పరదేశీయులను తరిమి దేశ స్వాతంత్ర్య సౌభాగ్యాన్ని కాపాడిన బంజారాలు నేడు ఎంతటి దీనావస్థలో ఉన్నారో పాఠకుల పాఠకులకు ఎరుకపరుస్తూ...

"రాజ్యాలు పోయి
రహదార్లు పట్టారు
తండాలు
వాటి ప్రతిబింబాలే..."

అంటూ బంజారా గిరిజనుల చారిత్రక వాస్తవికతను, నేటి తండా పరిపాలన వ్యవస్థను అక్షరాల సాక్షిగా తెలియజేస్తారు.

బంజారా బిడ్డలు చదువులో ఎప్పుడూ ముందుంటారని, యూనివర్సిటీల ప్రతిష్ఠను పెంచుతూ తమ ప్రతిభను నిరూపించుకుంటున్నారని, కవులుగా, కళాకారులుగా, విద్యావేత్తలుగా ఇలా ఏ రంగమైనా వారు ఎవ్వరికీ తీసిపోరని చెబుతూ...

"పలుగు పారతో
రాశాడు బాల్య కావ్యం
పెన్నూ పేపరుతో
నేడు మహా కావ్యం...."

"అక్షరాల వంతెన కట్టాను
వనారణ్యానికి
జనారణ్యానికి మధ్య...."

"కవిత్వం రాసింది
మట్టిమనిషి
గుప్పుమంటుంది
దాని పరిమళమే..."

ఆధునిక నాగరికత, పోకడలు మనిషిని అభివృద్ధి వైపు నడిపించినా, ఎంతో కొంత అసౌకర్యానికి కూడా గురిచేస్తున్న మాట వాస్తవం.

అంటూ బాల్యమంతా వ్యవసాయపు పనుల్లో, కూలీ పనుల్లో గడిచినా చదువంటే ప్రాణంగా భావించే బంజారా విద్యార్థుల హృదయాన్ని, ఏదైనా సాధించగలం అన్న ధీమాను నానీ పంక్తులలో వ్యక్తంచేస్తారు రచయిత్రి. మాలావత్ పూర్ణా,రమేష్ కార్తిక్ నాయక్ వంటి వారు ఈ సందర్భంగా గుర్తుకువస్తారు. ఈ నానీల్లో రచయిత్రి స్వయంగా తనను తానే ఒక ఉదాహరణగా అంతర్లీనంగా దర్శనమిస్తారు. తండాలు దాటి విశ్వవిద్యాలయాలలో చదువుకోవడంతో పాటు వ్యవస్థ అభివృద్ధికి నిరంతరం వారి కృషిని అందించడం ఇక్కడ మనం చూస్తాం.

ఆధునిక నాగరికత, పోకడలు మనిషిని అభివృద్ధి వైపు నడిపించినా, ఎంతో కొంత అసౌకర్యానికి కూడా గురిచేస్తున్న మాట వాస్తవం. భూమి, అడవి ఇలా ప్రతీ ఒక్కటి మనిషి తన స్వార్థానికి బలిచేస్తున్నాడు. దేనినీ వదిలిపెట్టడం లేదు. ఈ దుర్మార్గానికి గిరిజన గూడాలు, పెంటలు, తండాలు తమ అస్తిత్వాన్ని కోల్పోతున్నాయి. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ...

"తండాలను కూడా
వదలరా
భూ బకాసురులకు
ఏదైతేనేం..."

అంటూ రియల్టర్లను, భూ మాఫియాకారులను,ప్రకృతి సంపదను, ఖనిజాలను దోచుకునే దృష్టితో విధ్వంసం సృష్టించే విధ్వంసకారులకు అక్షరాల సాక్షిగా బుద్ధిచెబుతారు.

"జీవితానుభావలను
రంగరించాను
అయినా నానీలు
పుట్టుకొస్తూనే ఉన్నై..."

అంటూ తన బాల్యాన్ని, తాను ఎదగడానికి కారణమైన తండాను, తన ఉన్నత వ్యక్తిత్వాన్ని అందించిన కుటుంబ, తండా పెద్దల ప్రేమా ఆప్యాయతలను, తమదైన చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని తలచుకుంటూనే తండాలో నేడున్న విషమ పరిస్థితులను, ప్రపంచీకరణ, పట్టణీకరణ, వ్యాపరీకరణ నేపథ్యంలో బిక్కుబిక్కుమంటూ బ్రతుకులను పాఠకపరం చేస్తారు రచయిత్రి.

ఈ బంజారా నానీలు అక్షరాలుగా కుప్పలు పోసిన మానవ జాతి మూలాలు. మానవీయ మూలాలు. ఒకనాడు దేశసుభిక్షం కోసం లదణీలుగా కదిలిన బంజారాలు జాతీయ రహదారుల సృష్టికర్తలు. సంచారాన్ని సహజీవనంగా చేసుకున్న వీరు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుపూసలా నిలబడ్డవారు. సింధూ నాగరికత నాటి నుండి నేటిదాకా భారత నిర్మాణాన్ని చూసిన సాక్షులు. గిరిజనులలో అరుదైన వారి బ్రతుకులు భారతీయ చరిత్రను పలికిస్తాయి. అటువంటి చరిత్రను డా.సూర్యాధనంజయ్ నానీలుగా నమోదు చేశారు.

'పిరదౌసి' కావ్యంలో 'తేటగీతి' అక్షర దుందుభి

విల్సన్ రావు కొమ్మవరపు
89854 35515

శిల్ప రమణీయతకు, సామాజిక చైతన్యానికి మారుపేరైన మహాకవి గుర్రం జాషువా గారి కలం నుండి జాలువారిన 'పిరదౌసి' కావ్యం తెలుగు సాహిత్య చరిత్రలో ఒక ధ్రువతార. ఒక అక్షర శిల్పి ఆత్మగౌరవానికి, అహంకారపూరిత అధికార గర్వానికి మధ్య జరిగిన చారిత్రాత్మక సంఘర్షణను ఈ కావ్యం అద్దం పడుతుంది.

జూలై 1993లో హేమలతా లవణం గారి ద్వారా నాలుగవ ముద్రణగా వచ్చిన పిరదౌసి కావ్యంలోనూ, విశాలాంధ్ర ప్రచురణల సంస్థ వారు ప్రచురించిన జాషువా రచనలు రెండవ సంపుటం(జనవరి,2012)లోనూ పిరదౌసి కావ్యం మూడు భాగాలుగానే ఉంది.

కానీ, మనసు ఫౌండేషన్ వారు ప్రచురించిన జాషువా సర్వలభ్య రచనల సంకలనంలో ఈ కావ్యం నాలుగు భాగాలుగా ముద్రింపబడి ఉంది. అంటే మూడవ భాగాన్ని రెండుగా విభజించి నాలుగు భాగాలుగా చేశారు. మనసు ఫౌండేషన్ ముద్రణ ప్రకారం ఈ నాలుగవ భాగంలో చోటుచేసుకున్న నలభై ఒక్క పద్యాలలో పద్నాలుగు కంద పద్యాలు, పదకొండు తేటగీతి, మిగతావి ఉత్పలమాల, శార్దూలం, సీస పద్యాలు, చంపకమాల మొదలైనవి ఉన్నాయి. అయితే ఇక్కడ ప్రశ్న ఏమిటంటే ఈ కావ్యంలోని నాలుగవ ఆశ్వాసంలో కంద

పద్యంతోపాటు తేటగీతి పద్యానికి ఎందుకు అంతటి ప్రాధాన్యత ఇవ్వవలసి వచ్చింది. ఈ ఆశ్వాసంలో కథలోని నాటకీయ వేగాన్ని నడిపించడానికి జాషువా గారు కంద పద్యాలను వాడగా, ఆ వేగం వెనుక ఉన్న కవి అంతరంగపు ఆవేదనను, నిగూఢమైన తాత్త్విక సత్యాలను, కరుణ రసాన్ని పాఠకుల హృదయాలకు హత్తుకునేలా వివరించడానికి తేటగీతి పద్యాలను ఎంచుకున్నారని అనిపిస్తుంది.

బంగారు నాణేలు ఇస్తానన్న రాజగారు, తన భటులచే వెండి నాణేలను పంపించడంతో వాటిని తిరస్కరిస్తూ, రాజగారి లోభత్వాన్ని నిందిస్తూ పిరదౌసి పద్యాలు రాసి రాజగారికి పంపిస్తాడు.

★★★

పూర్వరంగంలోకి వెళితే, పారశీక కవులలో అత్యంత శ్రేష్ఠుడైన పిరదౌసి కవిని గజనీ మహమ్మదు పిలిపించి, నువ్వు రాజుల చరిత్రను తెలిపే షానామా అనే గ్రంథాన్ని రాసి నాకు అంకితమిస్తే, నువ్వు రాసే ప్రతి పద్యానికి ఒక బంగారు దీనారము చొప్పున ఇస్తాను అని రాజు వాగ్దానం చేశాడు. అందుకు కవి అంగీకరించి, గ్రంథ రచన ప్రారంభించాడు. ముప్పై సంవత్సరాల పాటు కష్టపడి, అరవై వేల పద్యాలతో ఆ గ్రంథాన్ని పూర్తి చేశాడు. ఆ తర్వాత రాజసభలో అందరి ముందు దానిని చదివి వినిపించాడు. అక్కడి కవులు, పండితులు అతని కవితా నైపుణ్యాన్ని ఎంతో మెచ్చుకున్నారు. పిరదౌసి ఆ గ్రంథాన్ని రాజుకు సమర్పించి తన ఇంటికి వెళ్ళిపోయాడు.

అయితే, ఆ అరవై వేల పద్యాలకు బంగారు నాణేలు ఇస్తానన్న రాజుగారు, తన భటులచే వెండి నాణేలను పంపించడంతో వాటిని తిరస్కరిస్తూ, రాజుగారి లోభత్వాన్ని నిందిస్తూ పిరదౌసి పద్యాలు రాసి రాజుగారికి పంపిస్తాడు. దీనితో గజనీ మహమ్మదు తీవ్ర ఆగ్రహానికి లోనై, ఆ కవిని పట్టుకుని చంపేయమని తన భటులను ఆజ్ఞాపించాడు. విషయం తెలుసుకున్న పిరదౌసి తన భార్యాపిల్లలతో కలిసి గజనీ నగరాన్ని విడిచి, తన సొంత ఊరైన తూసు పట్టణానికి వెళ్ళి తలదాచుకోవాలని నిశ్చయించుకున్నాడు. ఎన్నో కష్టాలు పడుతూ అడవులను దాటి, కొన్ని రోజులకు పారశీక దేశం చేరుకుని అక్కడ నివసించసాగాడు.

తనను విమర్శిస్తూ పిరదౌసి రాసిన పద్యాలను చదివి తీవ్ర ఆగ్రహానికి లోనైన సుల్తాన్ ఆజ్ఞతో, క్రూరమైన సైన్యం కవిని బంధించడానికి కదిలిన తీరుతో ఈ నాలుగవ భాగపు కథా ఘట్టం ప్రారంభమవుతుంది.

★★★

రాజుగారి లోభత్వానికి బలైన ఒక సత్కవి జీవిత చరమాంకం, ఆయన మరణానంతరం రాజులో కలిగిన పశ్చాత్తాపం ఇందులో హృదయవిదారకంగా వర్ణించబడ్డాయి.

ముఖ్యంగా ఈ భాగం, కథా గమనంలో అత్యంత కీలకమైనది. సుల్తాన్ గజనీ మహమ్మదు ఆగ్రహానికి గురైన పిరదౌసి సకుటుంబంగా దేశం విడిచి వెళ్ళడం, ఆ తర్వాత సుల్తాన్ పశ్చాత్తాపపడి ధనాన్ని పంపడం, కానీ ఆ ధనం చేరేసరికే కవి శవం స్మశానానికి తరలిపోవడం వంటి అత్యంత రసవత్తరమైన, విషాదభరితమైన ఘట్టాల పద్యాలు 'తేటగీతి'లో చదవవచ్చు.

'తేటగీతి' పద్యం పేరులోనే తేటదనం ఉంది. దీని నడక ఎంతో సరళంగా, ప్రశాంతంగా, మనసుకు సూటిగా తాకేలా సాగుతుంది. ఒక అణచివేయబడిన కవి గుండెల్లోని సుదీర్ఘమైన నిట్టూర్పులను, పాలకుల హృదయహీనతను, లోతైన జీవిత సత్యాలను ఎలాంటి ఆడంబరాలు లేకుండా అత్యంత సహజంగా వ్యక్తీకరించడానికి తేటగీతి నడక ఎంతో తోడ్పడింది. అందుకే జాషువా గారు ఈ ఆశ్వాసంలో కంద పద్యాల తర్వాత తేటగీతికి అంతటి ఉన్నతమైన ప్రాధాన్యతను ఇచ్చారు.

రాజుగారి లోభత్వానికి బలైన ఒక సత్కవి జీవిత చరమాంకం, ఆయన మరణానంతరం రాజులో కలిగిన పశ్చాత్తాపం ఇందులో హృదయవిదారకంగా వర్ణించబడ్డాయి.

సామాజిక ప్రయోజనం ఆశించి, సాధారణ మానవుడి ఆలోచనకు అందనంత ఎత్తులో కవితాత్మక బింబాలను సృష్టిస్తూ, పాఠకుల గుండెల్లో సరికొత్త ఆలోచనల చైతన్యాన్ని రగిలించిన తేటగీతి పద్యాల కథా రసాన్ని, కవితా శిల్పం మరియు వ్యక్తీకరణ పరంగా ఒక నిరంతర సెలయేటి ప్రవాహంలా సాగి పాఠకుడిని రసార్ద్రుడిని చేసిన పదకొండు పద్యాల వరుస క్రమ విశ్లేషణ ఈ వ్యాస ఉద్దేశ్యం.

★★★

రాజుగారి వెండి నాణేల మోసాన్ని నిరసిస్తూ పిరదౌసి నిందా పద్యాలు రాసి పంపిన తర్వాత, రాజభవనంలో కవిని పట్టుకోవడానికి సైన్యం బయలుదేరినప్పుడు, కవి ముందే తప్పించుకున్నాడనే వార్త విన్న సుల్తాన్ గజనీ మహమ్మదుకు కలిగిన అహంకారపూరిత క్రోధం ఈ నాలుగవ ఆశ్వాసంలోని మొదటి తేటగీతి పద్యంలో అద్భుతమైన జాతీయ శిల్పంతో ఎలా సాక్షాత్కరించిందో చూడండి:

కవిని బంధించలేకపోయిన అపరాధానికి గాను, ఆ కోపాన్ని తట్టుకోలేక రాజు తన సొంత నమ్మకస్థులైన సైనికులపైనే...

దిక్కఱిన వంటయింటి కుందేటి నొక్క
పారసీకునిఁ జేజేఁత జాఱవిడిచి
స్వామి కవమతి సేయు లుచ్చాలటంచు
యవనభూపాలుఁ డెంతయు నాగ్రహించి

తమ రాజభవనంలో దిక్కులేకుండా పడి ఉన్న వంటయింటి కుందేలు వంటి ఒక సాధారణ పారశీక కవిని చేతులారా తప్పించుకుపోయేలా చేసి, నా వంటి సార్వభౌముడికి అవమానం తెచ్చిపెట్టారా అంటూ సుల్తాన్ తన భటులపై తీవ్రమైన ఆగ్రహాన్ని వ్యక్తపరిచాడు. ఈ పద్యంలో ‘దిక్కఱిన వంటయింటి కుందేడు’ అని కవిని సంబోధించడంలో, అహంకారంతో కళ్ళు మూసుకుపోయిన పాలకులకు ఒక అక్షర శిల్పి ఎంత అల్పంగా కనిపిస్తాడో ఆ అణచివేత ధోరణిని జాషువా గారు ఎంతో ప్రతీకాత్మకంగా వ్యక్తపరిచారు.

కవిని బంధించలేకపోయిన అపరాధానికి గాను, ఆ కోపాన్ని తట్టుకోలేక రాజు తన సొంత నమ్మకస్థులైన సైనికులపైనే ఏ విధంగా విరుచుకుపడ్డాడో తర్వాతి పద్యం రాజు యొక్క కృతజ్ఞతాహీనతను నిరూపిస్తుంది:

తన దివాణంబుఁ గొలిచి, యట్టములనుండి
కలహములలోన రక్తముఁ జిలుకుచున్న
భటులఁ గొందఱఁ గట్టించి బందిచేసె
నెటిఁ గృతజ్ఞత లెఱుఁగ దా నృపుని యలుక

తన కొలువులో ఉంటూ, యుద్ధ భూమిలో కోట బురుజులపై నిలబడి రాజ్యం కోసం రక్తాన్ని చిందించిన నమ్మకమైన భటులను కొందరిని

సుల్తాన్ బంధించి కారాగారంలో వేశాడు; ఆ రాజుగారి కోపానికి ఎలాంటి కృతజ్ఞత అనేది తెలియదు. ప్రాణాలు అర్పించే సైనికుల పట్ల, అక్షరాలు అర్పించే కవుల పట్ల ఏమాత్రం కృతజ్ఞత లేని నిరంకుశ పాలన ఏ విధంగా ఉంటుందో జాషువా గారు ఈ పద్యంలో ఎంతో నిశితంగా చిత్రించారు.

మరణం లేని తన కావ్యాలలో మీ పేరును చిరస్థాయిగా నిలిపి, పూజించి మీకు అంకితమిచ్చిన ఆ పుణ్యమూర్తి అయిన పిరదౌసిని మీరు స్వచ్ఛమైన...

ఇలా రాజుగారి కపటత్వానికి సైనికులు సైతం బలవుతున్న తరుణంలో, ఈ అన్యాయాన్ని భరించలేక వివేకవంతులైన సామంత రాజులు సుల్తాన్ లోభత్వాన్ని ప్రశ్నిస్తూ పంపిన హితబోధ సందేశంలోని తార్కిక శిల్పం ఈ క్రింది పద్యంలో ఆవిష్కృతమైంది:

ఇట్టి మీ పేరు మృతిలేని కృతులలోనఁ
బొదివి పూజించి యిచ్చిన పుణ్యమూర్తి
నమల తపనీయరాశి నోలార్చవలెనొ;
తెగడి నైరాశ్యమున ముంచి తేల్చవలెనొ?

మరణం లేని తన కావ్యాలలో మీ పేరును చిరస్థాయిగా నిలిపి, పూజించి మీకు అంకితమిచ్చిన ఆ పుణ్యమూర్తి అయిన పిరదౌసిని మీరు స్వచ్ఛమైన బంగారు నాణేల రాశిలో ముంచెత్తాలా, లేక ఇలా అవమానించి నిరాశలో ముంచి తేల్చాలా అని సామంత రాజులు సుల్తాన్‌ను నిలదీశారు. 'మృతిలేని కృతులు' అనే పదం ద్వారా కవిత్వం యొక్క అమరత్వాన్ని చాటుతూ, కవిని వేధించడం రాజుగారి వంశానికే అవమానకరమని వారు హెచ్చరించారు.

సత్కవి కన్నీరు రాజ్యానికే ముప్పు తెస్తుందని గుర్తు చేస్తూ, సామంత రాజులు సుల్తాన్ కొలువుకు చేసిన ఆఖరి హితోపదేశం తర్వాతి పద్యంలో ఎంతో మార్దవంగా సాగుతుంది:

మా యవన రాజ్యమునకుఁ బూర్ణాయువు లని
తలఁచుకొనుచుందు మెపుడు సుల్తాను వృషభ!
లలితకళలు విడంబించు నెలవు మీఁదు
నిందుకొలువున కవులకన్నీరు తగదు

ఓ సుల్తాన్ శ్రేష్ఠుడా!, మా యవన రాజ్యానికి మీరే సంపూర్ణమైన ఆయువు అని మేము ఎల్లప్పుడూ భావిస్తుంటాము; లలితకళలకు నిలయమైన మీ నిండు సభలో ఒక సత్కవి కన్నీరు కార్చడం ఏమాత్రం తగదు. కళలను పోషించాల్సిన సభ కవులను ఏడిపించే వేదిక కాకూడదనే సామాజిక సత్యాన్ని ఈ తేటగీతి నడక ఎంతో ప్రసన్నంగా వ్యక్తీకరించింది.

ఇలా పండితుల గోష్ఠిలో ఉన్న సుల్తాన్‌కు ఒకనాడు ఒక గాయకుడు పిరదౌసి రాసిన పద్యాలను పాడి వినిపించగా...

ఈ హితబోధల వల్ల సుల్తాన్ మనసు మారి, కవులతో, పండితులతో గడుపుతూ పశ్చాత్తాపం చెందుతున్న తరుణంలో, ఆ రాజసభలోని సాహిత్య వాతావరణం తర్వాతి పద్యంలో ఒక అందమైన దృశ్యంగా మారుతుంది:

కవులు కలకంఠ బహు కుహూకార మధుర
భావగుంభితకవిత చెప్పందొడఁగిరి;
పండితులు తదంచిత రసాస్వాదనంబుఁ
జేసి సోత్సాహులై విమర్శించుచుండ్రి

ఆ సభలోని కవులు కోకిలల కుహూకారముల వలె ఎంతో మధురమైన, గంభీరమైన భావాలతో కూడిన కవిత్వాన్ని చెప్పడం ప్రారంభించారు; పండితులు ఆ కవితా రసాన్ని ఆస్వాదిస్తూ ఎంతో ఉత్సాహంగా విమర్శలు సాగిస్తున్నారు. 'కలకంఠ బహు కుహూకార' అనే శబ్దాల కూర్పు ద్వారా సభలోని సాహిత్య సౌరభాన్ని జాషువా గారు ఎంతో ఆహ్లాదకరంగా వ్యక్తీకరించారు.

ఇలా పండితుల గోష్ఠిలో ఉన్న సుల్తాన్‌కు ఒకనాడు ఒక గాయకుడు పిరదౌసి రాసిన పద్యాలను పాడి వినిపించగా, ఆ పద్యాలలోని ఆర్తిని విని రాజు తన అంతరంగంలో ఏ విధంగా ఆవేదన చెందాడో తర్వాతి ఈ పద్యంలో స్పష్టమవుతుంది:

ఏమి చెప్పుదు నిత్యసంతృప్తి దేల్చి
విపులవాఙ్మయ సేవ గావించినాఁడు
దానవలయంబు లిరుగేలఁ దాల్చినాఁడు
పిరదవుసి నేమొ పూర్తిగా మఱచినాఁడు

ముత్యాలకు నిలయమైన సముద్రంలో నేను ఎన్నోసార్లు మునకలు వేశాను, కానీ దురదృష్టవంతుడినైన నాకు ఒక్క ముత్యం కూడా దక్కలేదు

ఈ సత్కవి తన జీవితాంతం నిత్యసంతృప్తితో ఉంటూ విశాలమైన సాహిత్య సేవ చేశాడు, తన రెండు చేతులతో దానాలు చేసే గొప్ప మనసు కలవాడు; అలాంటి పిరదౌసిని ఈ రాజు పూర్తిగా మర్చిపోయాడు కదా అని సుల్తాన్ తనలో తాను కుమిలిపోయాడు. తన కోసం ముప్పై ఏళ్లు కష్టపడిన కవిని మర్చిపోయిన పాలకుడి అంతఃసంఘర్షణ ఇక్కడ హృదయవిదారకంగా వ్యక్తమైంది.

కవిని వేధించాననే బాధతో సుల్తాన్ వెంటనే ఒంటెలపై బంగారాన్ని పంపగా, అటు తూసు పట్టణంలో దరిద్రంతో మగ్గిపోతున్న పిరదౌసి కవి చనిపోవడానికి ముందు పలికిన చివరి నిరాశానిస్పృహల వాక్యాలు తర్వాతి పద్యంలో గుండెలను పిండేస్తాయి:

ముత్యముల కిక్క యైన సముద్రమునను
బెక్కు మాఱులు మున్క లు వేసినాఁడ
భాగ్యహీనుఁడ ముత్యంబు పడయ నైతి
వనధి నను మ్రింగ నోరువిచ్చినది తుదకు

ముత్యాలకు నిలయమైన సముద్రంలో నేను ఎన్నోసార్లు మునకలు వేశాను, కానీ దురదృష్టవంతుడినైన నాకు ఒక్క ముత్యం కూడా దక్కలేదు; చివరికి ఆ సముద్రమే నన్ను మింగడానికి నోరు తెరిచింది అని పిరదౌసి ఆవేదన చెందాడు. ఇక్కడ సముద్రం అనగా రాజుగారి ఆశ్రయం, ముత్యం అనగా దక్కాల్సిన గౌరవం. జీవితాంతం శ్రమించినా దరిద్రమే మిగిలి, చివరికి ఆ దరిద్రమే తన్ను మింగేస్తోందని కవి పలికిన ఈ మాటలు అణచివేయబడిన ప్రతి సృజనకారుడి ఆత్మఘోషకు ప్రతీకలు.

అలా ఆవేదనతోనే కవి కన్నుమూయగా, నిరుపేద కాపురంలో ఉన్న ఆయన కుమార్తె పడిన కష్టాలు, కవి మరణించిన ఆ దయనీయ స్థితి తర్వాతి పద్యంలో దైవఘటనగా ఆవిష్కృతమవుతాయి:

పెండ్లి కెదిగిన కూఁతురు ప్రియవధూటి
చింతచే దస్సి బిట్టు కృశించి కుమిలి
చేతనయిన సపర్యలు సేయుచుండఁ
దనువు చాలించె నేమందు దైవఘటన!

పెళ్ళికి ఎదిగిన ఆయన ప్రియమైన కుమార్తె తండ్రి స్థితిని చూసి చింతతో కృశించిపోతూ, తనకు చేతనైన సేవలు తండ్రికి అందిస్తుండగానే, పిరదౌసి కన్నుమూశాడు; విధి చేసిన ఈ వింత నాటకాన్ని ఏమనాలి! ఒక మహాకావ్యాన్ని సృష్టించిన కవికి జీవిత చరమాంకంలో కనీసం కూతురి పెళ్లి కూడా చేయలేని దైన్యం మిగిలిందనడంలో జాషువా గారి కరుణ రసపోషణ పరాకాష్ఠకు చేరింది.

కవి బతికుండగా పైసా ఇవ్వని అధికారం, ఆయన చనిపోయాక కోట్లు కుమ్మరించినా లాభం లేదనే నిష్ఠుర సత్యాన్ని ఈ పద్యం కళ్ళకు కడుతుంది.

కవి మరణించిన ఆ క్షణంలోనే రాజు పంపిన ధనరాశి ఊరిలోకి ప్రవేశించగా, కాలం చేసిన ఆ పరమ రస విపర్యాయాన్ని తర్వాతి పద్యం ఒక అద్భుతమైన తాత్త్విక రహస్యంగా ఆవిష్కరిస్తుంది:

సుకవి దేహంబు ప్రేతభూమికి లభింప
అర్థ మప్పుడె శూన్యగేహమును జేరె
నిమిషభేదంబు నడుమ సంధింపఁబడిన
ఈ రహస్యంబుఁ గనుఁగొన నెవరితరము?

సత్కవి యొక్క పవిత్ర దేహం స్మశాన వాటికకు తరలిపోతుండగా, రాజు పంపిన ఆ అపారమైన ధనరాశి (అర్థము) కవి లేని ఆ శూన్య గృహానికి చేరుకుంది. ఈ విధి విలాస రహస్యాన్ని తెలుసుకోవడం ఎవరి తరం! కవి బతికుండగా పైసా ఇవ్వని అధికారం, ఆయన చనిపోయాక కోట్లు కుమ్మరించినా లాభం లేదనే నిష్ఠుర సత్యాన్ని ఈ పద్యం కళ్లకు కడుతుంది.

కవి కుమార్తె ఆ ధనాన్ని తిరస్కరించి, కవి శవం స్మశానానికి వెళ్ళిపోయిందనే ఘోరమైన వార్త విన్న తర్వాత, సుల్తాన్ గజనీ మహమ్మదు ఏ విధంగా మానసిక క్షోభను అనుభవించాడో ఈ క్రింది పద్యంలో స్పష్టమవుతుంది:

కొలువు చాలించి, కన్నీరు గ్రుక్కుకొనుచు
బిరబిరంబోయి శయనమందిరముఁ జొచ్చి
ద్వారములు మూసికొని, కవీశ్వరునిఁ దలఁచు
కొనుచుఁ, దనుఁదాను నిందించుకొనఁ దొడంగె

సుల్తాన్ వెంటనే తన సభను ముగించి, కన్నీళ్లను లోపలికే దిగమింగుకుంటూ వేగంగా తన పడకగదిలోకి వెళ్లాడు; తలుపులన్నీ మూసేసుకుని, ఆ కవీశ్వరుడిని తలుచుకుంటూ తనను తాను నిందించుకోవడం ప్రారంభించాడు. అహంకారంతో కళ్లు మూసుకుపోయిన పాలకుడిపై అక్షర శక్తి సాధించిన నైతిక విజయం ఇది.

రాజు కట్టించిన ఆ సత్రశాల యొక్క శిథిలాలు నేటికీ కనిపిస్తాయి, వాటిని చూసి పారశీక దేశ ప్రజలు ఇప్పటికీ కన్నీరు విడుస్తారు

రాజు పశ్చాత్తాపంతో కవి పేరు మీద తూసు పట్టణంలో ఒక సత్రశాలను కట్టించగా, కాల గమనంలో ఆ కట్టడం శిథిలమైనా చరిత్ర ఎవరికి ఎలాంటి స్థానాన్ని ఇచ్చిందో ముగింపు పద్యం తేటతెల్లం చేస్తుంది:

దాని శైథిల్యములు నేఁడుఁ గానఁబడును;
పారసీకులు చూచి కన్నీరు విడుతు
రఁట మహమ్మదుగారికి నపయశంబు
నిండు సత్కీర్తి కవికిని నిలిచిపోయె.

రాజు కట్టించిన ఆ సత్రశాల యొక్క శిథిలాలు నేటికీ కనిపిస్తాయి, వాటిని చూసి పారశీక దేశ ప్రజలు ఇప్పటికీ కన్నీరు విడుస్తారు; చివరికి ఆ మహమ్మదు రాజుకు శాశ్వతమైన అపకీర్తి, ఆ మహాకవికి నిండు సత్కీర్తి చరిత్రలో నిలిచిపోయాయి. భౌతికమైన కట్టడాలు కూలిపోయినా కవి కీర్తి కూలిపోదని ఈ ముగింపు పద్యం నిరూపిస్తుంది.

★★★

నేటి ఆధునిక సమాజానికి, కాలమాన పరిస్థితులకు జాషువా గారి 'పిరదౌసి' కావ్యంలోని పద్యాలు దిక్సూచిలా ఉపయోగపడుతున్నాయి. భౌతికమైన సంపద, తాత్కాలికమైన అధికారం కంటే అక్షర రూపమైన జ్ఞానమే

శాశ్వతమైనదని ఈ కావ్యం నిరూపిస్తుంది. సమాజంలో కళాకారులకు, సృజనకారులకు లభించాల్సిన కనీస గౌరవాన్ని, ఆత్మగౌరవాన్ని గుర్తించడంలో పాలకులు లేదా సమాజం విఫలమైతే, చరిత్ర వారిని ఎన్నటికీ క్షమించదనే పరమ సత్యాన్ని జాషువా గారు నాడు నొక్కి చెప్పారు.

కవిత్వం కేవలం పాలకుల భోగభాగ్యాలను కీర్తించడానికి మాత్రమే కాదు, అది సమాజంలో ఒక చైతన్యాన్ని, పశ్చాత్తాపాన్ని రగిలించే ఒక అద్భుతమైన ఆయుధమని నిరూపించడంలో జాషువా గారి దూరదృష్టి అనన్యసామాన్యమైనది. కాలగర్భంలో రాజులు, సామ్రాజ్యాలు కలిసిపోయినా, కవి రాసిన అక్షరం షానామా (చరిత్ర)లాగా సూర్యచంద్రులు ఉన్నంత కాలం నిలిచే ఉంటుందనే సామాజిక సత్యాన్ని ఎంతో ఉదాత్తంగా, కవితాత్మకంగా సాహితీ ప్రపంచానికి అందించి సమాజంలో ఒక గొప్ప సద్బుద్ధిని, చైతన్యాన్ని తీసుకువచ్చారు మహాకవి, పద్మభూషణ్ గుర్రం జాషువా.

హైకూలు

డా. వి.ఆర్.రాసాని ✆ 9848443610

1. స్తన్యం
అమ్మ స్తన్యంలో పాలు
పాప కళ్లలో మెరసే
నదులు

2. కొరవి దెయ్యం
ఆకాశంలో కొరవి దెయ్యం
ప్లాస్టిక్ పెట్టెల్లో దాక్కున్న
చల్ల దనం

3. విరిగిన పాలి
సూర్యుని కిరణాల శాంతికి
వాసన కోల్పోయిన గాలి
విరిగి పోయిన పాలి

4. తొండ నాలుక
తడారిపోయిన తొండ నాలుక
స్వేచ్ఛగా తిరుగుతున్న
ఈగల మూక

5. అమ్మ
అమ్మ మళ్ళీ పుట్టింది
నాన్నా
అంటోంది

6. వైరస్ మందలు
వికటించిన ప్రకృతి ప్రేమ
జీవుల శ్వాస నిండా
వైరస్ మందలే

7. ఎండల వరద
ఎండల పెను వర్షం
వేడి గాలుల తుఫాను
ఆగిపోతున్నశ్వాసలు

8. తెల్ల నాసికం
ఎదురు పడిన
నల్ల చర్మం
మూతపడిన తెల్ల నాసికం

9. దూరం
తునకకు
పప్పుకు
ఆమడ దూరం

10. ఆశల గమ్యం
ఆశల అలలపై
తేలిన గమ్యం
నిరాశల పాతాళం

బంజారా ఆత్మగౌరవం అక్షరాలైన కావ్యం "ధూళి చక్రాలు"

డా. యడవల్లి సైదులు
99852 42330

డా. ధనంజయ్ నాయక్ మూడ్ రచించిన ధూళి చక్రాలు కవిత్వం బంజారా జాతి యొక్క 5000 సంవత్సరాల సంచార చరిత్ర, సాంస్కృతిక వారసత్వం, సామాజిక పోరాటాలకు అక్షర రూపం. ఈ పత్రం ఈ వ్యాసం సంపుటిలోని కవితలను ఆధారంగా చేసుకొని భాషే శాస్త్రం, ఇప్పటికీ చెవుల్లో మారుమోగుతున్నాయి నాటి చరిత్రలు, "లద్ది" ఆగినా స్ఫూర్తి వదిలం అనే విషయాలను లోతుగా విశ్లేషిస్తుంది. భాషా అస్తిత్వం, దైనందిన వివక్ష నుండి ఆత్మగౌరవం వరకు, వ్యవస్థాగత అణచివేత నుండి ప్రతిఘటన వరకు సాగే ఈ కావ్య ప్రయాణం అణచివేయబడ్డ ఒక జాతికి స్వరాన్ని ఎలా అందించిందో ఈ అధ్యయనం వివరిస్తుంది.

కీలక పదాలు: ధూళి చక్రాలు, బంజారా కావ్యం, గోర్బోలి, క్రిమినల్ ట్రైబ్స్ చట్టం, సామాజిక వివక్ష, సాంస్కృతిక అస్తిత్వం.

ఉపోద్ఘాతం : సాహిత్యం ఒక సమాజపు అద్దం. ఆ అద్దంలో తమ ప్రతిబింబం కోసం శతాబ్దాలుగా ఎదురుచూస్తున్న జాతి బంజారాలు. డా. ధనంజయ్ నాయక్ రాసిన ధూళి చక్రాల అనే కావ్య సంపుటి ఆ ఎదురుచూపుకు ముగింపు పలికింది. "సంచారమే సంస్కృతి, సాహసమే స్వభావం, ఉక్కు సంకల్పంతో సంప్రదాయాన్ని కాపాడుతూ"అనే పంక్తులు ఈ కావ్య లక్ష్యాన్ని స్పష్టం చేస్తాయి. ఇది కేవలం కవితల సంకలనం కాదు, సింధూ నదీ తీరం నుండి రాజ్యాంగ ఎనిమిదో షెడ్యూల్ డిమాండ్ వరకు సాగిన ఒక జాతి మహా ప్రస్థానం.

కవితా వస్తు ప్రాధాన్యత

ధూళి చక్రాలు కావ్యం యొక్క వస్తువు అత్యంత ప్రాధాన్యత కలిగినది. ఎందుకంటే ఇది స్వాతంత్ర్యానంతర భారత సాహిత్యంలో ఇప్పటివరకు అణచివేయబడి, అస్పృశ్యంగా మిగిలిపోయిన ఒక మొత్తం జాతి చరిత్రకు తొలిసారిగా కావ్యాత్మక స్వరాన్ని ఇచ్చింది. సింధూ నాగరికత నుండి సంచార "లద్ది" వాణిజ్యం, క్రిమినల్ ట్రైబ్స్ చట్టం వల్ల కలిగిన సామాజిక కళంకం, తెలంగాణ రైతాంగ పోరాటంలోని త్యాగాలతోపాటు నేటి "గోర్బోలి" భాషా అస్తిత్వ సంక్షోభం వరకు ఈ ఐదు వేల సంవత్సరాల నిరంతర ప్రయాణాన్ని ఒకే కావ్య పరిధిలో బంధించడం ద్వారా కవి బంజారా సమాజాన్ని కేవలం "గిరిజన తెగ"గా కాకుండా భారతదేశ సాంస్కృతిక, ఆర్థిక, చారిత్రక నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన ఒక స్వేచ్ఛా యాత్రిక జాతిగా పునఃస్థాపిస్తాడు.

> **రెండవ పంక్తిలో కవి ఈ భాష చారిత్రక మూలాలను, జ్ఞాన వ్యవస్థను ఆవిష్కరిస్తాడు.**

కవితా విశ్లేషణ

భాష అంటే అస్తిత్వం – భాషే శాస్త్రం కవిత

ఈ కవిత ధూళి చక్రాలు సంపుటికి సైద్ధాంతిక పునాది. బంజారాల "గోర్బోలి" భాషను కవి ఒక నిర్జీవమైన సంభాషణ సాధనంగా చూడలేదు. దానికి జీవం పోసి ఆత్మ ఇచ్చాడు. మొదటి పంక్తిలో కవి భాషను ఒక "ఇల్లు"గా, ఒక "చిత్రం పటం"గా రూపకల్పన చేస్తాడు. "అది కేవలం ఒక భాష కాదు / కదిలే ఒక ఇల్లు, హృదయంలో మోసే చిత్రం పటం" అని ఇక్కడ భాష అనేది కేవలం పదాల సముదాయం కాదు. అది ఒక సురక్షిత నివాసం, ఒక గుర్తింపు. అది "అమ్మ ఒడిలో జోలపాటగా", "డప్పుల దరువులో నాట్యమై" జీవిస్తుంది. అంటే భాష జీవితంలోని ప్రతి మధుర, కఠోర క్షణంలోనూ భాగమై ఉందనే భావనని కవి స్థాపిస్తాడు. రెండవ పంక్తిలో కవి ఈ భాష చారిత్రక మూలాలను, జ్ఞాన వ్యవస్థను ఆవిష్కరిస్తాడు. "గోర్బోలి" అనేది "కార్వాన్ రహదారులపై పుట్టింది". ఇది "రాయబడకముందే" నడిచింది అని దీనికి రుజువుగా చెప్తాడు కవి. "మౌఖిక గాథలే వారి గ్రంథాలు /జానపద గీతాలే వారి విశ్వవిద్యాలయాలు" అనడంలో రాత లేకుండానే ఒక జాతి వేల ఏళ్ళ

జ్ఞానాన్ని, చరిత్రను, విలువలను ఆ జాతి ఎలా భద్రపరిచిందో ఈ పంక్తులు చాటుతున్నాయి. "పాట చెప్పిందే పట్టం, సంప్రదాయమే సంస్కారం" అనే వాక్యం వారి జ్ఞాన వ్యవస్థకు ఇచ్చే అత్యున్నత గౌరవం. మూడవ ప్యారాలో హెచ్చరిక, పిలుపు. ఆధునికత పేరుతో వస్తున్న "గ్లోబలైజేషన్ ముసుగులో ఆ స్వరం మూగమవుతోంది" అని కవి ఆందోళన వ్యక్తం చేస్తాడు. కాబట్టి అతని తీర్మానం స్పష్టం.

బస్సులో, బజార్లో వినిపించే మాట"ఏయ్ లంబాడీ... పక్కకు జరుగు... ముట్టుకోకు."

"గోర్బోలి బతికితేనే చరిత్ర బతుకుతుంది / సంస్కృతి నిలిస్తేనే..."

ఈ కవిత ద్వారా కవి భాషా సంరక్షణను రాజ్యాంగపరమైన, సాంస్కృతికమైన అవసరంగా నిలబెడతాడు. "అవమానం నుండి ఆత్మగౌరవం వరకు/ఇప్పటికీ చెవుల్లో మారుమోగుతున్నాయి!" అన్న కవిత ఈ సంపుటిలోనే అత్యంత హృదయ విదారకమైన, అదే సమయంలో అత్యంత శక్తివంతమైన కవిత. ఇది బంజారా మహిళలు, మొత్తం జాతి రోజువారీ జీవితంలో ఎదుర్కొనే కుల, సామాజిక వివక్షను నగ్నంగా ఆవిష్కరిస్తుంది.

మొదటి పాదంలో ఆ వివక్ష యొక్క దారుణతను చూపిస్తాడు కవి. బస్సులో, బజార్లో వినిపించే మాట"ఏయ్ లంబాడీ... పక్కకు జరుగు... ముట్టుకోకు." ఈ ఒక వాక్యం ఒక మనిషిని "అపవిత్రం"గా, "నేరం చేసినట్టు"గా నిలబెడుతుంది. దేవత పేరు "లచ్చిమీ"ని కూడా "వెక్కిరింపు, వేళాడింపు"గా మార్చిన సామాజిక క్రూరత్వాన్ని కవి బయటపెడతాడు. "చిరునవ్వును అడ్డం పెట్టి అధికారం చేసే వంకర నవ్వు" అనే వర్ణన సభ్యత ముసుగులోని దుర్మార్గాన్ని చూపిస్తుంది.

రెండవ పాదంలో కవి ఆ అవమానం యొక్క సుదీర్ఘ ప్రభావాన్ని చిత్రిస్తాడు. బంజారాలు "నిశ్శబ్దమే రక్షణ" అని నేర్చుకున్నారు. ఎందుకంటే "ఎదురు తిరిగితే ఉద్యోగం పోతుంది, అన్నం పోతుంది". విద్యా వ్యవస్థ, రాజకీయ వ్యవస్థ, ఆర్థిక వ్యవస్థ అన్నీ కలిసి వారిని "సంఖ్యలుగా, కూలీలుగా, దూరంగా" చూశాయి. ఎనభైల తర్వాత వివక్ష "స్వరాన్ని తగ్గించింది కానీ బరువును కాదు". ఇది సూక్ష్మ వివక్ష, వ్యవస్థాగత పక్షపాతం యొక్క సూక్ష్మమైన విశ్లేషణ. మూడవ పాదంలో ఈ కవిత యొక్క టర్నింగ్ పాయింట్. ఇక్కడ కవి నిరాశ

నుండి నిర్మాణం వైపు మళ్ళుతాడు. "ఒకప్పుడు 'ముట్టుకోకు' అని విన్న మహిళల చేతులే ఈ రోజు రచయిత్రుల్ని, న్యాయవాదుల్ని పెంచాయి". "అప్పుడు నవ్వులపాలైన వేషాలే ఈ రోజు విశ్వవిద్యాలయాల్లో తలెత్తుకుని నడుస్తున్నాయి". ఇది ప్రతిఘటన. బాధను బలంగా మార్చుకున్న చరిత్ర. చివరి పంక్తి ఈ మార్పుకు సారాంశం."మా నొప్పి పోలేదు, కానీ అది ఆత్మగౌరవం అనే కొత్త భాష నేర్చుకుంది."అంటాడు ధనంజయ్ నాయక్.

"లద్ది" అంటే బంజారాల వాణిజ్య కారవాన్. శతాబ్దాలుగా దేశమంతా తిరిగిన ఆ చక్రాలు ఒక చట్టంతో ఆగిపోయాయి.

మరో కవితలో వ్యవస్థాగత అణచివేతను చెబుతూ "లద్ది ఆగినా స్ఫూర్తి వదిలం..."అంటాడు. ఈ కవిత బంజారా జాతి చరిత్రలో ఒక విషాదకరమైన మలుపును వివరిస్తుంది. "లద్ది" అంటే బంజారాల వాణిజ్య కారవాన్. శతాబ్దాలుగా దేశమంతా తిరిగిన ఆ చక్రాలు ఒక చట్టంతో ఆగిపోయాయి. కవి ఆగిపోయిన క్షణాన్ని శోకగీతంగా మారుస్తాడు. "చట్టమనే ఉక్కులాంటి పాదంతో చక్రాలు ఆగిపోయాయి/కనిపించని సంకెళ్ళతో గుండెల్లో గారంగా మోగుతూ..." ఇది కేవలం ఒక వాణిజ్య మార్గం ఆగడం కాదు ఒక మొత్తం జీవన విధానం, సంస్కృతి స్తంభించడం.ఇందుకు కవి కారణం చెప్తాడు.

"చేసిన పనికేసం కాదు, వారి జీవన విధానికే శిక్షగా." బ్రిటిష్ వారు తీసుకొచ్చిన క్రిమినల్ ట్రైబ్స్ చట్టం" ఒక పుట్టుకతోనే నేరస్తులు అనే ముద్రను ఒక జాతిపై వేసింది. తర్వాత పాదం ఆ చట్టం యొక్క మానసిక ప్రభావాన్ని చెప్తుంది. "కనిపించని సంకెళ్ళు" అనే పదబంధం చాలా శక్తివంతం. చట్టం తీసేసినా ఆ నీడ, ఆ భయం, ఆ అపనమ్మకం తరతరాలుగా కొనసాగింది. స్వాతంత్ర్యం తర్వాత కూడా 1952 వరకు ఆ చట్టం ఉండడం ఆ తర్వాత కూడా షెడ్యూల్డ్ ట్రైబ్ గుర్తింపు రాకపోవడం ఇదంతా "చట్టం" అనే ఆయుధం ఒక జాతిని ఎలా శాశ్వతంగా వెనుకబాటుతనంలోకి నెట్టిందో చూపిస్తుంది.

"స్ఫూర్తి వదిలం" శీర్షికలోనే ఉంది ఒక చైతన్యం. చక్రాలు ఆగినా ఆత్మ చావలేదు. ఈ కవిత ఆ తర్వాత వచ్చే గుర్తింపుకు పోరాటం అనే అధ్యాయాలకు

పీఠిక లాంటిది. ఒక వ్యవస్థ తమను ఆపినా తమ అస్తిత్వ పోరాటం ఆగదు అనే సంకల్పాన్ని ఈ కవిత గర్భంలో దాచుకుంది.

ఒకప్పుడు 'ముట్టుకోకు' అని విన్న మహిళల చేతులే ఈ రోజు రచయిత్రుల్ని, న్యాయవాదుల్ని పెంచాయి...

కవి సామాజిక హృదయం

డా. ధనంజయ్ నాయక్ మూడ్ యొక్క సామాజిక హృదయం ధూళి చక్రాలులో ప్రతి పంక్తిలోనూ స్పష్టంగా వినిపిస్తుంది. ఆయన కేవలం చరిత్రకారుడిగా కాకుండా ఒక బాధిత సమాజపు గొంతుగా మారాడు. బ్రిటిష్ కాలం నాటి "క్రిమినల్ ట్రైబ్స్ చట్టం" వల్ల ఒక జాతి మొత్తం "నేరస్తులు"గా ముద్ర వేయబడిన అన్యాయాన్ని "చట్టమనే ఉక్కులాంటి పదంతో చక్రాలు ఆగిపోయాయి" అనే రూపకంతో గుండెలకు హత్తుకునేలా చిత్రించాడు. అదేవిధంగా బజార్లలో, బస్సుల్లో బంజారా మహిళలు ఎదుర్కొన్న "ఏయ్ లంబాడీ... పక్కకు జరుగు... ముట్టుకోకు" అనే రోజువారీ అవమానాన్ని డాక్యుమెంట్ చేయడం ద్వారా కవి సమాజంలోని సూక్ష్మ వివక్ష, సభ్యత ముసుగులోని క్రూరత్వాన్ని బట్టబయలు చేసాడు. చరిత్ర పుస్తకాల్లో చోటు దక్కని "రాజా నాయక్" వంటి వీరులను, "పేరులేని ధైర్యవంతులను" గుర్తుచేస్తూ "ఈ కవితనే వారి స్మారకం" అని అక్షరాంజలి ఘటించడం ఆయనకు ఉన్న చారిత్రక న్యాయబద్ధత పట్ల గల చిత్తశుద్ధిని చూపిస్తుంది.

కానీ కవి హృదయం కేవలం బాధను వర్ణించడంతో ఆగదు అది పరిష్కార దిశగా, ఆత్మగౌరవ దిశగా పయనిస్తుంది. "గ్లోబలైజేషన్ ముసుగులో మూగమవుతున్న" గోర్బోలి భాష కోసం ఆయన ఆందోళన చెందడం, "ఎనిమిదో షెడ్యూల్లో స్థానం" కావాలని రాజ్యాంగబద్ధంగా డిమాండ్ చేయడం, "సంస్కృతి నిలిస్తేనే బంజారాల వారసత్వం నిలుస్తుంది" అని పిలుపునివ్వడం వంటివన్నీ ఆయన నిర్మాణాత్మక చింతనకు నిదర్శనాలు. అత్యంత ముఖ్యంగా "ఒకప్పుడు 'ముట్టుకోకు' అని విన్న మహిళల చేతులే ఈ రోజు రచయిత్రుల్ని, న్యాయవాదుల్ని పెంచాయి" అని చెప్పడం ద్వారా కవి తన సమాజానికి ఆశను, ఆత్మగౌరవాన్ని అందించాడు.

చివరగా "ఓ భవిష్యత్ తరాల్లారా! లేవండి, మేల్కొనండి" అని యువతను లేపడం ద్వారా ఆయన ఒక కవి పాత్రను దాటి ఒక సామాజిక ఉద్యమ నాయకుడిగా మారాడు. ఇదే ధూళి చక్రాలు కవితల వెనుక ఉన్న కవి యొక్క నిజమైన సామాజిక హృదయం.

> కవితాత్మకథ విషయానికి వస్తే ధూళి చక్రాలు ఒక సరళ రేఖ కథగా చూడలేం.

కవి రచనా శైలి, కవితాత్మకథ

డా. ధనంజయ్ నాయక్ మూడ్ రచనా శైలి ధూళి చక్రాలులో ఒక ప్రత్యేకమైన ఇతిహాస కావ్య ధోరణిని సంతరించుకుంది. ఆయన చరిత్రను తోడి వాస్తవాల క్రమంగా, జీవం ఉన్న కావ్య కథనంగా మలిచాడు. ఆయన శైలిలోని ప్రధాన లక్షణం "రూపకాత్మకత". "లద్ది"ని, "ధూళి చక్రాలను" ఒక జాతి ప్రయాణానికి సంకేతంగా, "క్రిమినల్ ట్రైబ్స్ చట్టాన్ని" "ఉక్కు సంకెళ్ళు"గా, "గోర్బోలి"ని "కదిలే ఇల్లు"గా చిత్రించడం ద్వారా కవి నైరూప్య భావనలకు స్పష్టమైన, భావోద్వేగపూరితమైన రూపాన్నిచ్చాడు.

మరో ముఖ్యమైన శైలి "ప్రత్యక్ష సంభాషణ". "ఓ భవిష్యత్ తరాల్లారా! లేవండి, మేల్కొనండి, చూడండి!!" అనే ఆదేశాత్మక పంక్తులు పాఠకుడిని కేవలం ప్రేక్షకుడిగా కాకుండా ఉద్యమంలో భాగస్వామిని చేస్తాయి. అంతేకాదు కవి స్వయంగా తన మూలాలను నిరూపించే విధంగా అసలు కావ్యం నుండే "మౌఖిక గాథలే వారి గ్రంథాలు, జానపద గీతాలే వారి విశ్వవిద్యాలయాలు" వంటి సాక్ష్యాత్మక కోట్స్ ఇవ్వడం ఈ కావ్యానికి ఒక పరిశోధనాత్మక విశ్వసనీయతను తెచ్చిపెట్టింది.

కవితాత్మకథ విషయానికి వస్తే ధూళి చక్రాలు ఒక సరళ రేఖ కథగా చూడలేం. ఇది ఒక చక్రీయ, సంగ్రహ కావ్యం. ఈ కావ్యం "సింధూ నదీ తీరం నుండి" మొదలై, "లద్ది" వాణిజ్య వైభవాన్ని, "వ్యాయా" వంటి సాంస్కృతిక గొప్పదనాన్ని వర్ణించి, ఆపై "చట్టమనే ఉక్కు"తో వచ్చిన పతనం, "ముట్టుకోకు" అనే అవమానం అనే విషాద ఘట్టాలకు దిగుతుంది. ఇది కావ్య కథనంలోని సంఘర్షణ దశ. కానీ కవి కథ అక్కడితో ముగించలేదు. విద్య, పోరాటం, రచనల ద్వారా వచ్చిన పునరుత్థానం, "రచయిత్రులు, న్యాయవాదులు" రూపంలో వచ్చిన విజయం "జగన్నాథ రథచక్రాలై"

నిలవాలనే ఆకాంక్షతో కావ్యం క్లైమాక్స్ కు చేరుకుంటుంది. ఈ విధంగా "సాహసం – పతనం – ప్రతిఘటన – ఆత్మగౌరవం" అనే నాలుగు అంచెల్లో సాగే ఈ కవితాత్మకథ ఒక మొత్తం జాతి యొక్క సామూహిక ఆత్మకథగా నిలుస్తుంది.

బంజారా స్త్రీలు ధరించే దారాల పూసలు, ఫెట్యా వంటి అలంకారాలను ఆయన "చరిత్రకు నగిషీలు చెక్కిన గుర్తులు"గా అభివర్ణిస్తాడు.

ధూళి చక్రాలును దళిత సాహిత్యం వంటి కావ్యాలతో పోల్చినప్పుడు ఒక స్పష్టమైన వ్యత్యాసం కనిపిస్తుంది. దళిత సాహిత్యం ప్రధానంగా కుల వ్యవస్థలోని స్థిరమైన అణచివేత, గ్రామీణ జీవితం, నేలకు బంధించబడిన బాధను కేంద్రంగా చేసుకుంటే, ధూళి చక్రాలు యొక్క వస్తువు "సంచారమే". ఇక్కడ బాధ స్థిరత్వం నుండి కాదు, "క్రిమినల్ ట్రైబ్స్ చట్టం" వంటి వ్యవస్థలు సంచారానికి విధించిన నిర్బంధం నుండి పుట్టింది. అదేవిధంగా గిరిజన సాహిత్యం ప్రకృతి, అడవి, గిరిజన దేవతల చుట్టూ తిరుగుతుండగా, డా. ధనంజయ్ కావ్యం "లద్ది", "కార్వాన్ రహదారులు", "వాణిజ్య జ్ఞానం" అనే పట్టణ–గ్రామీణ అనుసంధాన వస్తువును ముందుకు తెస్తుంది. అంటే ధూళి చక్రాలు కవిత్వం దళిత–గిరిజన సాహిత్య ధారకు కొత్త కోణం అయిన "సంచార జాతి సాహిత్యం" లేదా "Nomadic Literature" అనే ఒక ప్రత్యేక శాఖకు నాంది పలుకుతుంది.

సాంస్కృతిక అంశాల కవిత్వీకరణ

డా. ధనంజయ్ నాయక్ మూడ్ ధూళి చక్రాలులో బంజారా సంస్కృతిని కేవలం వర్ణించకుండా దానికి ఒక కావ్యాత్మక గౌరవాన్ని, తాత్విక లోతును ఇచ్చాడు. ముఖ్యంగా భాష, అలంకారం, ఆచారం అనే మూడు సాంస్కృతిక స్తంభాలను ఆయన కవిత్వీకరించిన తీరు ప్రత్యేకం. గోర్బోలి భాషను ఆయన "కదిలే ఇల్లు"గా చిత్రించడం ద్వారా భాష అనేది కేవలం సంభాషణ సాధనం అనుకోవద్దని అది ఒక జాతి తనతో పాటు మోసుకెళ్ళే సాంస్కృతిక నివాసం అని తన కవిత్వంలో చూపించాడు. అదేవిధంగా బంజారా స్త్రీలు ధరించే దారాల పూసలు, ఫెట్యా వంటి అలంకారాలను ఆయన "చరిత్రకు నగిషీలు చెక్కిన గుర్తులు"గా అభివర్ణిస్తాడు. ఇక్కడ భౌతిక వస్తువు ఒక కళాఖండంగా,

ఒక చారిత్రక దస్తావేజుగా రూపాంతరం చెందుతుంది. దీని ద్వారా కవి సంస్కృతిని మ్యూజియంలో భద్రపరిచే వస్తువుగా కాకుండా జీవిస్తున్న, ఊపిరి పోసుకుంటున్న వారసత్వంగా చూపించాడు.

ఆయన కవిత్వంలో ఆచార వ్యవస్థను కవిత్వీకరించిన విధానం చూడవచ్చు. బంజారా సాంప్రదాయ వివాహమైన "వ్యాయా"ను ఆయన కేవలం ఒక తంతుగా చూడలేదు. అందులో వరుడు పడే "పరీక్షలను" సహనం, శ్రమ, బాధ్యతకు నిదర్శనంగా, ఆ సంబంధాన్ని "సమాన ధైర్యం కలిగిన ఇద్దరి భాగస్వామ్యంగా" నిర్వచించాడు. "ప్రకృతే పురోహితంగా" జరిగే ఈ వివాహం అనే వర్ణన ఈ సమాజానికి ప్రకృతితో ఉన్న అవిభాజ్య బంధాన్ని సూచిస్తుంది. అదేవిధంగా తీజ్, దండి మేరమా వంటి పండుగలను ఆయన సామాజిక ఐక్యతను, సామూహిక జ్ఞాపకాన్ని పునరుత్పత్తి చేసే సాంస్కృతిక యంత్రాంగాలుగా నిలబెట్టాడు. ఈ విధంగా కవి బంజారా సంస్కృతిలోని ప్రతి అంశానికి ఒక అర్థాన్ని, ఒక ఆత్మగౌరవాన్ని జోడించి వాటిని కావ్యంలో శాశ్వతం చేశాడు.

ధూళి చక్రాలు అనేది ఒక కావ్యంగా మాత్రమే చూడొద్దు. ఇది ఒక చారిత్రక దస్తావేజు, ఒక సాంస్కృతిక ప్రణాళిక, ఒక సామాజిక మానిఫెస్టో.

ముగింపు

ధూళి చక్రాలు అనేది ఒక కావ్యంగా మాత్రమే చూడొద్దు. ఇది ఒక చారిత్రక దస్తావేజు, ఒక సాంస్కృతిక ప్రణాళిక, ఒక సామాజిక మానిఫెస్టో. కవి చివర్లో ఇచ్చే పిలుపు ఈ పుస్తక సారాంశానికిఅద్దంపడుతుంది."ఓ భవిష్యత్ తరాల్లారా! లేవండి, మేల్కొనండి, చూడండి!! ఈ వారసత్వాన్ని బలంగా, స్వేచ్ఛగా మోసుకెళ్ళండి.","ఒకనాటి ధూళి చక్రాలు నవజీవన జగన్నాథ రథచక్రాలై" నిలవాలనే ఆకాంక్షతో ముగిసే ఈ కావ్యం ఒక చారిత్రక సాహిత్య లోటుని పూడ్చింది.

కవి స్వయంగా చెప్పినట్టు"ఇది సంచార గిరిజనుల రాసిన, నడుస్తున్న, నడిచే చరిత్ర." ధూళి చక్రాలు ఒక బాధ కావ్యం, పోరాట కావ్యం, అంతకు మించి ఆత్మగౌరవ కావ్యం. సింధూ నదీ తీరం నుండి దక్కన్ పీఠభూమి

వరకు, "లద్ది" కార్వాన్ల దుమ్ముతో కూడిన దారుల నుండి రాజ్యాంగ గుర్తింపు కోసం సాగిన ఉద్యమం వరకు, బంజారా జాతి తన 5000 సంవత్సరాల చరిత్రలో అనుభవించిన కష్టాలను, అవమానాలను, త్యాగాలను ఇది అక్షర రూపంలో ఆవిష్కరిస్తుంది. బ్రిటిష్ వారు వేసిన "క్రిమినల్ ట్రైబ్స్ చట్టం" అనే ఉక్కు సంకెళ్ళు, బజార్లలో వినిపించిన "ముట్టుకోకు" అనే చీత్కారాలు, చరిత్ర పుటల్లో చోటు దొరకని "పేరులేని ధైర్యవంతుల" త్యాగాలు కవితా వస్తువులుగా మారి ఈ కావ్యానికి ఒక పోరాట స్వరాన్ని అందించాయి. కానీ ఈ కావ్యం బాధ దగ్గరే ఆగిపోలేదు. "ఒకప్పుడు 'ముట్టుకోకు' అని విన్న మహిళల చేతులే ఈ రోజు రచయిత్రుల్ని, న్యాయవాదుల్ని పెంచాయి" అంటూ, నొప్పిని "ఆత్మగౌరవం అనే కొత్త భాష"గా మార్చే సంకల్పాన్ని ఇది ప్రకటిస్తుంది. "గోర్బోలి" భాషకు, "వ్యాయా" వంటి సంప్రదాయాలకు, "లద్ది" వారసత్వానికి ఇచ్చిన గౌరవం ద్వారా మూగబోయిన ఒక జాతికి అక్షరాలతో ప్రాణం పోసిన ఈ కావ్యం భారతదేశపు బహుళ సాంస్కృతిక వారసత్వంలో ఒక ముఖ్యమైన అధ్యాయం. అందువల్ల, సాహిత్యపరంగా, సాంస్కృతికంగా, సామాజికంగా ధూళి చక్రాలు భారతీయ సాహిత్యంలో ఒక మైలురాయిగా నిలుస్తుంది. మొత్తంగా ధూళి చక్రాలు భారతీయ గిరిజన సాహిత్యంలో ఒక కొత్త దారిని వేసిందని చెప్పవచ్చు.

సూచన గ్రంథాలు

1. డా. ధనంజయ్ నాయక్ మూడ్ , ధూళి చక్రాలు: బంజారాల ఐతిహాసిక మహా ప్రయాణం. హైదరాబాద్: శీతల్ పబ్లికేషన్స్, 2024.

2. డా. సూర్యా ధనంజయ్ , బంజారా నానీలు,హైదరాబాద్.

రాయలసీమ అస్తిత్వం – మూడు పార్శ్వాలు

జి. త్రివిక్రమ్
✆ 99010 65406

నీళ్ళ కరువే సహజ లక్షణంగా ఉండే వర్షచ్ఛాయా ప్రాంతం **ప్రాకృతిక రాయలసీమ**. ఆ కరువు వల్ల రాటుదేలిన కరకుదనం, నాజూకులెరుగని మొరటుదనం సహజ లక్షణాలుగా ఉండే ప్రాంతం **సాంస్కృతిక రాయలసీమ**. రెండు శతాబ్దాల కిందట 'సీడెడ్ ఏరియా' పేరుతో నిజామ్ నవాబు నుంచి బ్రిటిష్ పాలన కిందికి పోయిన ప్రాంతం దాదాపుగా ఇదే. 50 ఏండ్ల కిందటి నుంచి జిల్లాల సరిహద్దుల ఆధారంగా విస్తరిస్తూ పోతున్న ప్రాంతం **రాజకీయ రాయలసీమ**. ఎప్పటికప్పుడు తన సరిహద్దులను మార్చుకుంటూ పోతున్న ఈ రాజకీయ విభాగం రాయలసీమలోని మిగతా పార్శ్వాలతో సంబంధం లేకుండా స్వతంత్రంగా విస్తరిస్తా ఉందని గుర్తించినప్పుడే రాయలసీమను, ఆ ప్రాంతపు విశిష్ట వ్యక్తిత్వాన్ని సరిగా అర్థం చేసుకోగలం.

దాదాపు దక్షిణ భారతదేశం అంతా శ్రీకృష్ణదేవరాయలు ఏలిన విజయనగర సామ్రాజ్యంలోని భాగమే. ఐతే రాయలు ఏలిన ప్రాంతం అనే అర్థంలో 'రాయలసీమ' అనే పేరు స్థిరపడింది మాత్రం దాంట్లో తెలుగు,

కన్నడ ప్రాంతాల్లోని నాలుగు జిల్లాల చిన్న భాగానికి మాత్రమే. 1928లో జరిగిన ప్రథమ దత్తమండల సమావేశంలో చిలుకూరి నారాయణరావు అప్పటి బళ్ళారి, కర్నూలు, అనంతపురం, కడప జిల్లాలతో కూడిన ప్రాంతానికి సీడెడ్/దత్తమండలం అనే పేరుకు బదులుగా రాయలసీమ అనే పేరును సూచించినారు. రాయలసీమతో పాటు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న వేర్వేరు ప్రాంతాల ఆధునిక చరిత్ర కింది విధంగా ఉంది:

నిజామ్ నవాబులు మొదట్లో మొఘల్ చక్రవర్తికి, తర్వాత మరాఠాలకు సామంతులుగా ఉండి 1805లో జరిగిన రెండవ ఆంగ్లో మరాఠా యుద్ధం తర్వాత బ్రిటిష్ సామంతులుగా ఉన్నారు.

సర్కారు ప్రాంతం: ఒడిశాలోని చిల్కా సరస్సు నుంచి దాదాపు ప్రకాశం జిల్లాలోని గుండ్లకమ్మ నది వరకు ఉన్నది సర్కారు ప్రాంతం. 1765లో మొఘల్ చక్రవర్తి జారీ చేసిన ఫర్మానా ద్వారా బ్రిటిష్ అధీనంలోకి వచ్చింది. ఇది కంపెనీ పాలన కింద చేరిన మొట్ట మొదటి తెలుగు ప్రాంతం.

ఆర్కాటు / కర్ణాటక ప్రాంతం: 1801లో కర్ణాటక నవాబు నుంచి నెల్లూరు (తర్వాతి కాలంలో ప్రకాశం జిల్లాలో కలిసిన ప్రాంతంతో కలిపి), ఉత్తర ఆర్కాట్ జిల్లాలు బ్రిటిష్ ఆధీనంలోకి వచ్చినాయి. 1911లో ఉత్తర ఆర్కాట్ జిల్లాను విడగొట్టి చిత్తూరు జిల్లాను ఏర్పరచినారు.

తెలంగాణ: నిజామ్ నవాబులు మొదట్లో మొఘల్ చక్రవర్తికి, తర్వాత మరాఠాలకు సామంతులుగా ఉండి 1805లో జరిగిన రెండవ ఆంగ్లో మరాఠా యుద్ధం తర్వాత బ్రిటిష్ సామంతులుగా ఉన్నారు. నిజాం పాలన కింద తెలంగాణతో పాటు పక్కనే మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలు, కర్ణాటక ఉత్తర ప్రాంతంలో "హైదరాబాద్ కర్ణాటక" అని పిలవబడే జిల్లాలు ఉండేవి. ఈ కన్నడ జిల్లాల వెనుకబాటుతనం వల్ల అక్కడ తెలంగాణ ప్రేరణతో ఇంకొక ఉద్యమం రాకుండా నివారించడానికన్నట్టు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు 2013లో 98వ రాజ్యాంగ సవరణ ఈ ప్రాంత అభివృద్ధి కోసం తీసుకోవలసిన ప్రత్యేక చర్యల గురించే జరిగింది.

రాయలసీమ: ఈ ప్రాంతం 18వ శతాబ్దంలో టిప్పు సుల్తాన్ ఏలుబడిలో ఉండేది. టిప్పు సుల్తాన్ వాళ్ళ అమ్మ పుట్టిల్లు కడప. 1798 నాటి మూడవ మైసూర్ యుద్ధంలో నిజామ్, మరాఠా, బ్రిటిష్ పాలకులు కలిసి టిప్పు సుల్తాన్‌ను ఓడించినాక పంపకాల్లో ఈ ప్రాంతం నిజామ్ భాగానికి వచ్చింది. నిజామ్ 1800లో ఈ ప్రాంతాన్ని సైన్య సహకార ఒప్పందం కింద బ్రిటిష్ కంపెనీకి వదిలివేసినాడు. అప్పటి నుంచి దీన్ని సీడెడ్ ఏరియా అని, దత్త మండలం అని అనేవాళ్ళు.

రాయలసీమ ప్రాంత ప్రాకృతిక లక్షణం కరువు. రాయలసీమలో 19వ శతాబ్దంలో చిన్నా చితకా కరువులు కాక...

1808లో ఈ చారిత్రిక రాయలసీమలో కన్నడ ప్రాబల్యం ఉన్న ప్రాంతాన్ని బళ్ళారి జిల్లాగా, పల్నాటి సరిహద్దుల నుంచి బెంగళూరు సరిహద్దుల్లోని మదనపల్లె వరకు ఉన్న తెలుగు ప్రాంతాన్ని కడప జిల్లాగా విడగొట్టినారు. తర్వాత కర్నూలు జిల్లా 1858లో, అనంతపురం జిల్లా 1882లో ఏర్పడినాయి.

1937లో శ్రీబాగ్ ఒప్పందం జరిగే నాటికి రాయలసీమలో ఉన్న జిల్లాలు బళ్ళారి, కడప, కర్నూలు, అనంతపురం. దానికి తగినట్టే ఆ ఒప్పందం మీద రాయలసీమ నుంచి సంతకాలు పెట్టినవాళ్ళలో ఈ 4 జిల్లాల వాళ్ళే ఉన్నారు తప్ప అప్పటికి 26 ఏండ్ల కిందట ఏర్పడిన చిత్తూరు జిల్లా నుంచి ఎవరూ లేరు. 1953లో తిరుపతిని ఆంధ్ర రాష్ట్ర రాజధాని చెయ్యాలని, లేకపోతే తమిళ ప్రాబల్యం ఉన్న చిత్తూరు జిల్లా మద్రాసు రాష్ట్రంలో కొనసాగడానికే మొగ్గు చూపవచ్చని గౌతు లచ్చన్న వాదిస్తే, చిత్తూరు జిల్లా రాయలసీమలో లేదు కాబట్టి శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం కుదరదని టంగుటూరి ప్రకాశం, ప్రభృతులు కొట్టి పారేసినారు.

ప్రాకృతిక రాయలసీమ – ప్రాథమిక లక్షణం: రాయలసీమ ప్రాంత ప్రాకృతిక లక్షణం కరువు. రాయలసీమలో 19వ శతాబ్దంలో చిన్నా చితకా కరువులు కాక వేలాది ప్రజలను ఆకలి చావులకు గురిచేసిన భయంకరమైన కరువులు 25 వచ్చినాయి. డొక్కల కరువు, పెద్ద కరువు, ధాత కరువు, దూప

కరువు, వలస కరువు, ముష్టి కరువు, గంజి కరువు వాటిలో కొన్ని.

ఈ వరుస కరువుల ఫలితంగా 1938లో మద్రాసు ప్రభుత్వం రాయలసీమ కరువు మీద ఒక కమిటీని వేసింది. ఆ కమిటీ కరువు సహాయక చర్యలతో పాటు సీడెడ్ జిల్లాలకు ప్రత్యేకంగా ఒక ఆర్థికాభివృద్ధి బోర్డును ఏర్పాటు చెయ్యాలని సిఫార్సు చేసింది. 1941లో ఏర్పాటైన ఆ బోర్డును రాయలసీమ డెవలప్‌మెంట్ బోర్డ్ అనేవాళ్ళు. ఐతే నిధుల కేటాయింపులు లేకపోవడం వల్ల దాని వల్ల పెద్దగా ఉపయోగం లేకపోయింది. 1949లో ఆ బోర్డు రద్దయింది.

1983లో రాయలసీమ బోర్డు రద్దు కావడంతో ఆందోళన చెందిన ఆ ప్రాంత నాయకులు రాయలసీమ అభివృద్ధి కోసం ఉద్యమాలు చేసినారు.

1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మొదలైనప్పుడు రాయలసీమ ఉద్యమం కూడా మొదలౌతాదేమోనన్న భయంతో ప్రభుత్వం తిరిగి రాయలసీమ అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేసింది. తర్వాతి ఏడాదే 1970లో ప్రకాశం జిల్లా ఏర్పడింది. కర్నూలు జిల్లా నుంచి ప్రకాశం జిల్లాలో చేరిన గిద్దలూరు, మార్కాపురం తాలూకాలు చారిత్రికంగా రాయలసీమలో భాగమే కాబట్టి ఆ రెండు తాలూకాలను కూడా రాయలసీమ బోర్డ్ పరిధిలోకి తీసుకుని, బోర్డ్ నిధులతో అభివృద్ధి చేసినారు.

అది చూసి నెల్లూరు జిల్లా పరిషత్ తమను కూడా రాయలసీమ బోర్డులో చేర్చుకొమ్మని అభ్యర్థించగా చారిత్రికంగా నెల్లూరు జిల్లాకు, రాయలసీమకు సంబంధం లేదని బోర్డు ఆ అభ్యర్థనను తిరస్కరించింది.

1983లో ఈ రాయలసీమ బోర్డుతో సహా అప్పటికి ఉన్న 3 ప్రాంతీయాభివృద్ధి బోర్డులను ఎన్టీయార్ ప్రభుత్వం రద్దు చేయగా 2007లో వయ్యెస్సార్ ప్రభుత్వం ఉత్తరాంధ్రతో కలిపి 4 ప్రాంతీయ అభివృద్ధి బోర్డులను తిరిగి ఏర్పాటు చేసింది. ఐతే రాష్ట్ర విభజన తర్వాత ప్రాంతీయ అభివృద్ధి బోర్డులే లేవు. 1983లో రాయలసీమ బోర్డు రద్దు కావడంతో ఆందోళన చెందిన ఆ ప్రాంత నాయకులు రాయలసీమ అభివృద్ధి కోసం ఉద్యమాలు చేసినారు. దాని వల్ల రాయలసీమకు కొంత మేలు జరిగింది.

ప్రాకృతిక రాయలసీమ – వర్షపాతం: రాష్ట్రం మొత్తం మీద అతి తక్కువ వర్షపాతం గల జిల్లాలు అనంతపురం (459 మిల్లీమీటర్లు), శ్రీ సత్యసాయి (527.2 మి.మీ.), కర్నూలు (548.3 మి.మీ.), కడప (630.9 మి.మీ.), నంద్యాల (656.2 మి.మీ.), అన్నమయ్య (668.1 మి.మీ.) అన్నీ రాయలసీమలోనివే.

చిత్తూరు, తిరుపతి జిల్లాల సంస్కృతి, భాష ఈ జిల్లాల కంటే భిన్నమైనవి, విలక్షణమైనవి.

రాజంపేట, రైల్వే కోడూరు ప్రాంతాలను కోల్పోయిన తర్వాత అన్నమయ్య జిల్లా వార్షిక వర్షపాతం ఇంకా తగ్గే అవకాశం ఉంది. 2025లో పునర్వ్యవస్థీకరించడానికి ముందు చిత్తూరు, తిరుపతి జిల్లాల వార్షిక వర్షపాతాలు 810.9 మి.మీ., 1,029.4 మి.మీ. చిత్తూరు జిల్లా వర్షపాతం అనంతపురం జిల్లా వర్షపాతానికి దాదాపు రెండు రెట్లుండగా, తిరుపతి జిల్లా వర్షపాతం చిత్తూరు కంటే 27%, రాష్ట్ర సగటు వర్షపాతం (860.3 మి.మీ.) కంటే 20% ఎక్కువ.

ప్రాకృతిక రాయలసీమ – వ్యవసాయ ఉత్పాదకత: శ్రీకృష్ణ కమిటీ నివేదిక ప్రకారం (2022లో కొత్త జిల్లాలు ఏర్పడక ముందు ఉన్న) ఉమ్మడి జిల్లాల్లో అనంతపురం వ్యవసాయ ఉత్పాదకత హెక్టారుకు ₹9,100 ఉంటే చిత్తూరు జిల్లాలో దానికి దాదాపు 3 రెట్లు (₹23,500) ఉంది. వెనుకబడిన ఉత్తరాంధ్రలో కూడా విశాఖపట్నంలో ₹23,600, శ్రీకాకుళంలో ₹22,300, విజయనగరంలో ₹20,700 ఉంటే రాయలసీమలోని కడప జిల్లాలో ₹12,900, కర్నూలు జిల్లాలో ₹15,800 మాత్రమే.

సాంస్కృతిక రాయలసీమ: రాయలసీమ ప్రాంత వ్యవసాయ పద్ధతులు, పాడి పంటలు, వృత్తి నైపుణ్యాలు, ఆట పాటలు, సంస్కృతి సంప్రదాయాలు, జీవన విధానాలు, భాష (మాండలికాలు), సాహిత్యం అన్నీ నీళ్ళ కరువు వల్ల ప్రభావితమైనవే.

పైన పేర్కొన్న ప్రాకృతిక రాయలసీమ ప్రాంతపు సాంస్కృతిక లక్షణాలు దాదాపుగా ఒకటే. చిత్తూరు, తిరుపతి జిల్లాల సంస్కృతి, భాష ఈ జిల్లాల కంటే భిన్నమైనవి, విలక్షణమైనవి. ఐతే గత 60 ఏండ్లుగా ఉమ్మడి చిత్తూరు జిల్లాను కూడా రాజకీయ సౌలభ్యం కోసం రాయలసీమతో కలిపి చెప్పడం

అలవాటైంది. శ్రీబాగ్ ఒప్పందం నాటికి ఉన్న 4 రాయలసీమ జిల్లాల్లో బళ్ళారి జిల్లా కర్ణాటకకు పోయినా తర్వాత ఆ స్థానంలో 4వ జిల్లాగా చిత్తూరు జిల్లాను చేర్చి చెప్పడం ఒక సర్దుబాటు. ఈ సర్దుబాటుకు అవకాశం ఇచ్చింది 6 సూత్రాల పథకంలోని జోనల్ వ్యవస్థ.

అప్పటికే అభివృద్ధి అంతా హైదరాబాద్ కేంద్రంగానే జరగడం, దానికి ముల్కీ నిబంధనలు తోడవడంతో 'జై ఆంధ్రా' ఉద్యమం మొదలైంది.

6 సూత్రాల పథకం: 1915లో నిజామ్ జారీ చేసిన ఫర్మానా ద్వారా ముల్కీ నిబంధన అమల్లోకి వచ్చింది. దాని ప్రకారం హైదరాబాద్ సంస్థానంలో పుట్టిన వాళ్ళు, లేదా అక్కడ కనీసం 15 ఏండ్లుగా నివసిస్తూ, ఇక తమ ప్రాంతానికి తిరిగి వెళ్ళబోమని అఫిడవిట్ ఇచ్చిన వాళ్ళు మాత్రమే అక్కడి ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హులు. ముల్కీ నిబంధనలు చెల్లవని అంతకు ముందు కొట్టేసిన సుప్రీమ్ కోర్టే 1972లో మళ్ళా చెల్లుతాయని తీర్పు ఇచ్చింది.

అప్పటికే అభివృద్ధి అంతా హైదరాబాద్ కేంద్రంగానే జరగడం, దానికి ముల్కీ నిబంధనలు తోడవడంతో 'జై ఆంధ్రా' ఉద్యమం మొదలైంది. ఆ ఉద్యమాన్ని చల్లబరచడానికి ఇందిరా గాంధీ ప్రభుత్వం రాష్ట్రంలోని పివి నరసింహారావు ప్రభుత్వాన్ని 1973 జనవరిలో రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించి, ముల్కీ నిబంధనలకు బదులుగా 6 సూత్రాలను ప్రతిపాదించింది. అవి:

1. స్థానిక శాసనసభ్యులు, నిపుణులతో ప్లానింగ్ బోర్డ్ ద్వారా రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి మీద తక్షణం దృష్టి పెట్టడం, అవసరమైన నిధులతో ఆయా ప్రాంతాలను నిర్దిష్ట కాలావధిలో అభివృద్ధి చెయ్యడం

2. హైదరాబాద్‌లో కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటు, ఇతర చర్యల ద్వారా వివిధ ప్రాంతాల్లో విద్యా సౌకర్యాల విస్తరణ, వాటిలో స్థానికులకు ప్రాధాన్యత

3. ఉద్యోగావకాశాల్లో స్థానికులకు ప్రాధాన్యత

4. ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల్లో వివాదాల పరిష్కారానికి అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ఏర్పాటు

5. పై సూత్రాలను రాజ్యాంగంలో చేర్చడం ద్వారా వాటి అమలుపై భరోసా కల్పించడం

6. పై సూత్రాలను అమలు చెయ్యడంతో పాటు కాలం చెల్లిన ముల్కీ నియమాలు, తెలంగాణ ప్రాంతీయ కమిటీలను రద్దు చెయ్యడం

ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చెయ్యడంలో పత్రికల పాత్ర ముఖ్యమైనది. చిత్తూరు జిల్లాకు రాయలసీమలో ఆమోదయోగ్యత పత్రికల ద్వారానే వచ్చింది.

ఆరు సూత్రాల ప్రణాళికతో అంతకు ముందు కుదుర్చుకున్న శ్రీబాగ్ ఒప్పందం, పెద్ద మనుషుల ఒప్పందం కూడా రద్దయినట్టే అని కొంతమంది వాదిస్తారు. ఆరు సూత్రాల అమలుతో ప్రాంతీయ అసమానతలు నిజంగా తొలగిపోయినట్టయితే అరవై ఏండ్లు గడిచినా ఇంకా తెలంగాణ, రాయలసీమల్లోని 4 జిల్లాలు దేశంలోనే అట్టడుగున ఎందుకు ఉన్నాయి? (నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం దేశంలోనే అత్యంత వెనుకబడిన Aspirational districtsలో తెలంగాణ నుంచి 3 జిల్లాలు, ఆంధ్ర ప్రదేశ్ నుంచి ఏజెన్సీ జిల్లాలైన అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యంతో పాటు కడప జిల్లా ఉన్నాయి.)

6 సూత్రాల పథకం అమలులో భాగంగా ఏర్పడిన జోనల్ వ్యవస్థలో మూడు రాయలసీమ జిల్లాలూ ఒకే జోన్లో ఉండడం వల్ల ఆ జోన్ రాయలసీమ జోన్‌గా వ్యవహరించబడడం, ఆ జోన్లోనే 4వ జిల్లాగా ఉన్న చిత్తూరు జిల్లాకు వేరే ఏ ప్రాంతంతోనూ సంబంధం లేకపోవడం వల్ల ఆ జిల్లాను కూడా రాయలసీమతో కలిపి వ్యవహరించడం అలవాటైంది.

ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చెయ్యడంలో పత్రికల పాత్ర ముఖ్యమైనది. చిత్తూరు జిల్లాకు రాయలసీమలో ఆమోదయోగ్యత పత్రికల ద్వారానే వచ్చింది. ఇటీవలి దశాబ్దాల్లో రాయలసీమకు అదే పత్రికల, మీడియా ప్రభావం వల్ల ఏర్పడిన ఇమేజ్ వల్ల సాధారణంగా రాయలసీమవాళ్ళగా చెప్పుకోవడానికి ఇతర జిల్లాలవాళ్ళ ఇష్టపడరు. ఐతే శాసనమండలి నియోజకవర్గాల్లో ఉమ్మడి కడప, అనంతపురం, కర్నూలు జిల్లాలను పశ్చిమ రాయలసీమ నియోజకవర్గం అని; ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలను తూర్పు రాయలసీమ

నియోజకవర్గం అని పత్రికల్లో, ప్రసార మాధ్యమాల్లో వ్యవహరిస్తున్నందుకు అభ్యంతరం వ్యక్తం కావడం లేదు.

రాయలసీమవాదుల్లో కొందరు ఈ మూడు జిల్లాలను రాయలసీమతో కలిపి 'గ్రేటర్ రాయలసీమ' అని వ్యవహరిస్తే మరికొందరు ఇంకొక అడుగు ముందుకేసి పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటకల్లోని మరికొన్ని జిల్లాలను కూడా గ్రేటర్ రాయలసీమలో కలిపి చెప్తారు.

ఇక్కడొక ఆసక్తికరమైన అంశమేమిటంటే 1997లో నంద్యాలలో జరిగిన రాయలసీమ ఉద్యమ అవగాహనా సదస్సు ఆమోదించిన చార్టర్ ఆఫ్ డిమాండ్స్‌లో విద్యా రంగానికి సంబంధించిన మొదటి అంశం: కోస్తాంధ్రలోని నెల్లూరు జిల్లాను శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధి నుంచి తొలగించాలని! ఇప్పుడు నెల్లూరు జిల్లాలో సగ భాగం ఆ విశ్వవిద్యాలయం ఉన్న తిరుపతి జిల్లాలోనే ఉండగా నంద్యాలే బయటిదైపోయింది.

2022లో కొత్త జిల్లాలను ఏర్పరచినప్పుడు కోస్తాంధ్రకు చెందిన నెల్లూరు జిల్లాలోని దక్షిణార్ధ భాగం తిరుపతి జిల్లాలో భాగం కావడం ఒక ముఖ్యమైన చారిత్రిక పరిణామం. దీని వల్ల కోస్తాంధ్రకు, రాయలసీమకు మధ్య రాజకీయ సరిహద్దులు పూర్తిగా చెరిగిపోయినాయి. సాంస్కృతిక సరిహద్దులు కూడా సుదూర భవిష్యత్తులో మాసిపోవచ్చునేమో గానీ ఇప్పటికైతే రాజకీయ సరిహద్దులంత స్పష్టమైన విభజన రేఖలు లేకపోయినప్పటికీ బలంగానే ఉన్నాయి. ఇరు ప్రాంతాల ఆచార వ్యవహారాల్లో, మాండలిక రూపాల్లో వ్యక్తమయ్యే సాంస్కృతిక భేదాలు దానికి నిదర్శనాలు.

పరిశోధనా వ్యాసం

మరుగున పడుతున్న మాతృభాషలు

డా. మానమ మునిరత్నం
85009 60100

1. ఉపోద్ఘాతం:

భాష అనేది మానవ నాగరికతకు మూలస్తంభం. మనిషి తన ఆలోచనలను వ్యక్తపరచడానికి, అనుభవాలను పంచుకోవడానికి, జ్ఞానాన్ని తరతరాలకు సంక్రమింపజేయడానికి భాషనే ప్రధాన సాధనంగా ఉపయోగించాడు. అయితే ప్రపంచంలోని అన్ని భాషలలో మాతృభాషకు ప్రత్యేకమైన స్థానం ఉంది. తల్లి ఒడిలో శిశువు తొలిసారిగా వినే మాట, నేర్చుకునే భాష, ప్రపంచాన్ని అర్థం చేసుకునే తొలి మాధ్యమం మాతృభాషే. అందువల్ల మాతృభాష అనేది కేవలం సంభాషణ సాధనం మాత్రమే కాదు; వ్యక్తిత్వ వికాసానికి, భావోద్వేగ నిర్మాణానికి, సామాజిక చైతన్యానికి, సాంస్కృతిక అస్తిత్వానికి పునాది. ఒక జాతి చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, జానపద విజ్ఞానం, సాహిత్య సంపద, జీవన విలువలు అన్నీ భాషలోనే నిక్షిప్తమై ఉంటాయి. భాష అనేది ఒక సమాజపు సామూహిక స్మృతి. అందువల్ల ఒక భాష మరుగున పడడం అంటే కేవలం కొన్ని పదాలు వినియోగంలో లేకపోవడం కాదు; ఆ భాషతో ముడిపడి ఉన్న చరిత్ర, సంస్కృతి, జ్ఞాన వ్యవస్థ, జీవన దృక్పథం కూడా క్రమంగా కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో భాషల పరిరక్షణ అనేది కేవలం భాషాశాస్త్రానికి సంబంధించిన అంశం మాత్రమే కాదు; అది మానవ నాగరికత పరిరక్షణకు సంబంధించిన విశ్వవ్యాప్త బాధ్యతగా మారింది.

ప్రస్తుతం ప్రపంచీకరణ, పట్టణీకరణ, వలసలు, ఆధిపత్య భాషల ప్రభావం, విద్యా విధానాలలో వచ్చిన మార్పులు, సమాచార సాంకేతిక విప్లవం వంటి అనేక కారణాల వల్ల ప్రపంచవ్యాప్తంగా వేలాది మాతృభాషలు అంతరించిపోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా చిన్న

భాషలు, గిరిజన భాషలు, అల్పసంఖ్యాక భాషలు మరియు వలస ప్రాంతాల్లో మాట్లాడే మాతృభాషలు క్రమంగా తమ సహజ జీవన పరిధిని కోల్పోతున్నాయి. కుటుంబాల్లో భాషా సంక్రమణ తగ్గిపోవడం, విద్యా రంగంలో మాతృభాషకు ప్రాధాన్యం తగ్గడం, యువత ఆధిపత్య భాషల వైపు మొగ్గు చూపడం వంటి పరిణామాలు ఈ పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తున్నాయి. ఈ విషయాన్ని ప్రముఖ భాషాశాస్త్రవేత్త డేవిడ్ క్రిస్టల్ అత్యంత అర్థవంతంగా ఇలా పేర్కొన్నారు: "When a language dies, a unique vision of the world dies with it." (David Crystal, Language Death, Cambridge University Press, 2000, p- 68.) ఈ వ్యాఖ్య ప్రతి భాష ఒక ప్రత్యేకమైన ప్రపంచ దృక్పథాన్ని, సాంస్కృతిక అనుభవాన్ని, మానవ జ్ఞానాన్ని తనలో నిక్షిప్తం చేసుకుని ఉంటుందని స్పష్టం చేస్తుంది. అందువల్ల భాషా వైవిధ్యాన్ని కాపాడడం అంటే మానవ నాగరికతలోని వైవిధ్యాన్ని సంరక్షించడమే.

రాజ్యాంగం గుర్తించిన భాషలతో పాటు వందలాది ప్రాంతీయ, గిరిజన, మాండలిక భాషలు భారతీయ సంస్కృతిని సుసంపన్నం చేస్తున్నాయి.

భారతదేశం ప్రపంచంలో అత్యధిక భాషా వైవిధ్యం కలిగిన దేశాలలో ఒకటి. రాజ్యాంగం గుర్తించిన భాషలతో పాటు వందలాది ప్రాంతీయ, గిరిజన, మాండలిక భాషలు భారతీయ సంస్కృతిని సుసంపన్నం చేస్తున్నాయి. అయినప్పటికీ ఆధునిక విద్యా విధానం, ఉపాధి అవకాశాలు, సామాజిక ప్రతిష్ఠ వంటి కారణాల వల్ల అనేక మాతృభాషలు నేడు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా ఇతర రాష్ట్రాలలో నివసిస్తున్న భాషా అల్పసంఖ్యాకుల మాతృభాషలు మరింత క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. తమిళనాడులో తెలుగు భాష పరిస్థితి కూడా ఈ నేపథ్యంలో పరిశీలించదగిన ముఖ్యమైన అంశంగా నిలుస్తుంది.

ఈ వ్యాసంలో మాతృభాషల ప్రాధాన్యం, వాటి క్షీణతకు దారితీసిన చారిత్రక, సామాజిక కారణాలు, ప్రపంచీకరణ మరియు విద్యా వ్యవస్థ ప్రభావం, తమిళనాడులో తెలుగు భాష స్థితిగతులు, మాతృభాషల పరిరక్షణకు

అవసరమైన కార్యాచరణలు వంటి అంశాలను పరిశోధనాత్మక దృష్టితో విశ్లేషించడం ప్రధాన ఉద్దేశ్యం. మాతృభాషల పరిరక్షణ అనేది గతాన్ని కాపాడుకోవడం మాత్రమే కాదు; భావితరాల సాంస్కృతిక అస్తిత్వాన్ని, జ్ఞాన సంపదను, మానవ వైవిధ్యాన్ని సంరక్షించే చారిత్రక బాధ్యత అనే అవగాహనను ఈ వ్యాసం ప్రతిపాదిస్తుంది.

ప్రతి మాతృభాష ఒక ప్రత్యేకమైన సాంస్కృతిక ప్రపంచాన్ని ప్రతిబింబిస్తుంది.

2. మాతృభాషలు మానవ నాగరికతకు పునాదులు:

మాతృభాష అనేది మానవ నాగరికత నిర్మాణంలో అత్యంత ప్రాథమికమైన అంశం. వ్యక్తి తన జీవితంలో మొదటిసారిగా నేర్చుకునే భాష మాతృభాషే. శిశువు తన తల్లి, కుటుంబ సభ్యుల ద్వారా ప్రపంచాన్ని తెలుసుకోవడం ప్రారంభిస్తాడు. ఆ ప్రక్రియలో భాష కేవలం సంభాషణకు మాత్రమే పరిమితం కాకుండా ఆలోచన, భావోద్వేగం, సంస్కారం, విలువలు, వ్యక్తిత్వ నిర్మాణానికి మూలాధారంగా నిలుస్తుంది. అందువల్ల మాతృభాష అనేది ఒక వ్యక్తి జీవితానికే కాదు, సమాజ నిర్మాణానికి కూడా పునాదిగా చెప్పవచ్చు. భాష మానవ సమాజ వికాసానికి ప్రధాన సాధనం. లిపి ఆవిర్భావానికి ముందే మౌఖిక సంప్రదాయం ద్వారా అనేక తరాల జ్ఞానం ఒక తరం నుండి మరొక తరానికి సంక్రమించింది. వేట, వ్యవసాయం, వైద్యం, ప్రకృతి పరిజ్ఞానం, సామాజిక నియమాలు, నైతిక విలువలు, కళలు, సంప్రదాయాలు అన్నీ మాతృభాష ద్వారానే సమాజంలో వ్యాప్తి చెందాయి. ఈ కారణంగానే భాషను ఒక సమాజపు సామూహిక స్మృతి (Collective Memory) గా అభివర్ణిస్తారు.

ప్రతి మాతృభాష ఒక ప్రత్యేకమైన సాంస్కృతిక ప్రపంచాన్ని ప్రతిబింబిస్తుంది. ఒక ప్రాంత ప్రజల జీవన విధానం, ఆహార సంస్కృతి, వృత్తులు, పండుగలు, ఆచారాలు, విశ్వాసాలు, జానపద సంప్రదాయాలు, సామెతలు, పలుకుబడులు అన్నీ ఆ భాషలోనే సహజంగా వ్యక్తమవుతాయి. అందువల్ల భాష అనేది ఒక సమాజపు చరిత్రకు, సంస్కృతికి, నాగరికతకు అద్దం వంటిది. ఒక భాష అంతరించిపోతే, ఆ భాషలో నిక్షిప్తమైన అపారమైన జ్ఞాన సంపద కూడా శాశ్వతంగా కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడుతుంది.

భాషను స్థిరమైన వ్యవస్థగా కాకుండా నిరంతరం పరిణామం చెందే సాంస్కృతిక వ్యవస్థగా చూడాలి.

ఈ విషయాన్ని ప్రముఖ భాషాశాస్త్రవేత్త డేవిడ్ క్రిస్టల్ స్పష్టంగా వివరిస్తూ ఇలా పేర్కొన్నారు "When a language dies, a unique vision of the world dies with it." (David Crystal, Language Death, Cambridge University Press, 2000, p. 68.) ఈ వ్యాఖ్య ద్వారా ప్రతి భాష ప్రపంచాన్ని చూసే ఒక ప్రత్యేకమైన దృక్పథాన్ని కలిగి ఉంటుందని అర్థమవుతుంది. భాషల వైవిధ్యం అనేది మానవ మేధస్సు వైవిధ్యానికి ప్రతీక. అందువల్ల మాతృభాషలను పరిరక్షించడం అంటే కేవలం భాషను కాపాడడం మాత్రమే కాదు; మానవ నాగరికతలోని వైవిధ్యాన్ని కూడా సంరక్షించడం.

ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి భాషను సమాజ జీవనానికి ప్రతిబింబంగా పేర్కొంటూ, సమాజంలో జరిగే ప్రతి పరిణామం భాషలో ప్రతిఫలిస్తుందని అభిప్రాయపడ్డారు. భాష సమాజంతో కలిసి అభివృద్ధి చెందుతుంది; సమాజంలో మార్పులు వచ్చిన కొద్దీ భాష కూడా కొత్త పదాలను, కొత్త భావాలను స్వీకరిస్తూ సజీవంగా కొనసాగుతుంది. అందువల్ల భాషను స్థిరమైన వ్యవస్థగా కాకుండా నిరంతరం పరిణామం చెందే సాంస్కృతిక వ్యవస్థగా చూడాలి.

భారతదేశం భాషా వైవిధ్యానికి నిలయంగా ప్రసిద్ధి చెందింది. రాజ్యాంగం గుర్తించిన భాషలతో పాటు వందలాది ప్రాంతీయ, గిరిజన, మాండలిక భాషలు భారతీయ సంస్కృతిని సుసంపన్నం చేస్తున్నాయి. ఈ భాషలన్నీ భారతీయ నాగరికత నిర్మాణంలో విశిష్ట పాత్ర పోషించాయి. తెలుగు వంటి ప్రాచీన సాహిత్య సంపద కలిగిన భాషల నుండి చిన్న గిరిజన భాషల వరకు ప్రతి భాషకు సమానమైన సాంస్కృతిక విలువ ఉంది. అందువల్ల ఏ భాషను చిన్నదిగా, పెద్దదిగా చూడకుండా అన్ని మాతృభాషలను సమాన గౌరవంతో పరిరక్షించడం సమాజ బాధ్యత.

ఈ నేపథ్యంలో నేడు అనేక మాతృభాషలు ఎందుకు మరుగున పడుతున్నాయి? వాటి క్షీణతకు దారితీసిన చారిత్రక, సామాజిక, రాజకీయ, ఆర్థిక కారణాలు ఏమిటి? అనే అంశాలను పరిశీలించడం అత్యంత అవసరం.

ఈ కారణాలను విశ్లేషించడం ద్వారానే మాతృభాషల పరిరక్షణకు సమర్థవంతమైన మార్గాలను గుర్తించవచ్చు.

బ్రిటిష్ పాలనలో ఆంగ్లభాషకు అధిక ప్రాధాన్యం లభించింది. పరిపాలన, న్యాయవ్యవస్థ, ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు ఆంగ్లభాషతో ముడిపడటంతో...

3. మాతృభాషల క్షీణతకు చారిత్రక, సామాజిక నేపథ్యం:

మాతృభాషలు మరుగున పడడం అనేది ఒక్కసారిగా సంభవించిన పరిణామం కాదు. అది అనేక శతాబ్దాలుగా చోటుచేసుకున్న రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక మార్పుల ఫలితం. ప్రతి భాష తనను మాట్లాడే సమాజంతో కలిసి అభివృద్ధి చెందుతుంది. అదే విధంగా ఆ సమాజంలో ఏర్పడే మార్పులు భాష భవిష్యత్తును కూడా నిర్ణయిస్తాయి. అందువల్ల మాతృభాషల ప్రస్తుత పరిస్థితిని అర్థం చేసుకోవాలంటే వాటి చారిత్రక నేపథ్యాన్ని పరిశీలించడం అవసరం. ప్రాచీన కాలంలో ప్రజల జీవితం ప్రధానంగా గ్రామాలకే పరిమితమై ఉండేది. కుటుంబ వ్యవస్థ, వృత్తి వ్యవస్థ, వ్యవసాయ సంస్కృతి, స్థానిక పాలనా విధానాలు అన్నీ మాతృభాష ఆధారంగానే కొనసాగేవి. విద్య, కళలు, జానపద సంప్రదాయాలు, సామాజిక విలువలు కూడా స్థానిక భాషల ద్వారానే తరతరాలకు సంక్రమించాయి. ఈ కారణంగా మాతృభాషలు సమాజ జీవితంలో కేంద్రస్థానాన్ని ఆక్రమించాయి. అయితే కాలక్రమేణా రాజకీయ మార్పులు, రాజ్యాల విస్తరణ, వాణిజ్య సంబంధాలు, విదేశీ ప్రభావాలు భాషల మధ్య అసమానతలను పెంచాయి.

మధ్యయుగ కాలంలో పాలకుల భాషలు పరిపాలనలో ప్రాధాన్యం పొందినప్పటికీ, ప్రజల దైనందిన జీవితంలో మాతృభాషలు బలంగానే కొనసాగాయి. కానీ వలస పాలన ప్రారంభమైన తరువాత పరిస్థితి గణనీయంగా మారింది. ముఖ్యంగా బ్రిటిష్ పాలనలో ఆంగ్లభాషకు అధిక ప్రాధాన్యం లభించింది. పరిపాలన, న్యాయవ్యవస్థ, ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు ఆంగ్లభాషతో ముడిపడటంతో భారతీయ భాషల సామాజిక స్థితిలో మార్పు ఏర్పడింది. ఫలితంగా అనేక కుటుంబాలు తమ పిల్లలకు మాతృభాష కంటే ఆంగ్లభాషకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం ప్రారంభించాయి.

ఈ పరిస్థితిని రాబర్ట్ ఫిలిప్సన్ తన Linguistic Imperialism గ్రంథంలో విశ్లేషిస్తూ, ఆధిపత్య భాషలు కేవలం సంభాషణ సాధనాలుగా మాత్రమే కాకుండా రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక ఆధిపత్యానికి కూడా ప్రతీకలుగా మారతాయని పేర్కొన్నారు (Robert Phillipson, Linguistic Imperialism, Oxford University Press, 1992, pp. 47–50). ఈ అభిప్రాయం వలస పాలన కాలంలో భాషలపై ఏర్పడిన ప్రభావాన్ని స్పష్టంగా వివరిస్తుంది.

పట్టణ ప్రాంతాలలో పిల్లలు ఇంట్లో కూడా మాతృభాష కంటే ఇతర భాషలను ఎక్కువగా ఉపయోగించడం కనిపిస్తోంది.

భారతదేశంలో స్వాతంత్ర్యం అనంతరం ప్రాంతీయ భాషలకు రాజ్యాంగ పరిరక్షణ లభించినప్పటికీ, ప్రపంచీకరణ తరువాత పరిస్థితులు మళ్లీ మారాయి. ఉద్యోగ అవకాశాలు, ఉన్నత విద్య, సాంకేతిక రంగాలలో ఆధిపత్య భాషల అవసరం పెరగడంతో మాతృభాషల వినియోగం అనేక కుటుంబాలలో తగ్గడం ప్రారంభమైంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాలలో పిల్లలు ఇంట్లో కూడా మాతృభాష కంటే ఇతర భాషలను ఎక్కువగా ఉపయోగించడం కనిపిస్తోంది. ఈ పరిస్థితి తరాల మధ్య భాషా సంక్రమణకు తీవ్రమైన ఆటంకంగా మారింది.

ఈ ప్రక్రియను ప్రముఖ భాషాశాస్త్రవేత్త జోషువా ఎ. ఫిష్మన్ Language Shift (భాషా మార్పు)గా పేర్కొన్నారు. ఒక తరం మాట్లాడే భాషను తరువాతి తరం స్వీకరించకపోతే, ఆ భాష క్రమంగా బలహీనపడి చివరకు అంతరించే ప్రమాదం ఏర్పడుతుందని ఆయన వివరిస్తారు (Joshua A. Fishman, Reversing Language Shift, Multilingual Matters, 1991, pp. 43–58). భాషల అంతరించడానికి ఇదే ప్రధాన కారణమని ప్రపంచవ్యాప్తంగా అనేక పరిశోధనలు నిర్ధారించాయి.

ఇదే విషయాన్ని యునెస్కో కూడా తన Language Vitality and Endangerment (2003) నివేదికలో ప్రస్తావించింది. ఒక భాష భవిష్యత్తును నిర్ణయించే అత్యంత ముఖ్యమైన అంశం తరాల మధ్య భాషా సంక్రమణ (Intergenerational Language Transmission) అని

ఆ నివేదిక పేర్కొంది. కుటుంబంలో పిల్లలు మాతృభాషను సహజంగా నేర్చుకోకపోతే, ఆ భాష ఎంత గొప్ప సాహిత్య సంపద కలిగి ఉన్నప్పటికీ భవిష్యత్తులో సంక్షోభాన్ని ఎదుర్కొనే అవకాశం ఉందని యునెస్కో హెచ్చరించింది. అందువల్ల మాతృభాషల క్షీణతకు కేవలం ఒకే కారణాన్ని పేర్కొనడం సాధ్యం కాదు. చారిత్రక పరిణామాలు, వలస పాలన, విద్యా విధానాలు, పట్టణీకరణ, ఆర్థిక అవసరాలు, సామాజిక ప్రతిష్ఠ భావనలు, కుటుంబ వ్యవస్థలో వచ్చిన మార్పులు ఇవన్నీ కలిసి మాతృభాషలను మరుగున పడే పరిస్థితికి నెట్టాయి. ఈ నేపథ్యంలో ప్రపంచీకరణ, ఆధునిక విద్యా వ్యవస్థ, సాంకేతిక విజ్ఞానం వంటి సమకాలీన అంశాలు మాతృభాషలపై చూపుతున్న ప్రభావాన్ని విశ్లేషించడం అత్యంత అవసరం.

ఇతర భాషలను నేర్చుకోవడం అభివృద్ధికి అవసరమే అయినప్పటికీ, మాతృభాషను నిర్లక్ష్యం చేయడం వల్ల పిల్లలు తమ సాంస్కృతిక మూలాలతో క్రమంగా దూరమవుతున్నారు.

4. ప్రపంచీకరణ, విద్యా వ్యవస్థ, సాంకేతిక విజ్ఞానం, మాతృభాషలపై ప్రభావం:

ఇరవయ్యొకటవ శతాబ్దం ప్రపంచీకరణ (Globalization), సమాచార విప్లవం, సాంకేతిక అభివృద్ధికి ప్రతీకగా నిలిచింది. ప్రపంచ దేశాల మధ్య ఆర్థిక, విద్యా, సాంస్కృతిక, సాంకేతిక సంబంధాలు వేగంగా విస్తరించాయి. ఈ పరిణామాలు మానవ సమాజ అభివృద్ధికి అనేక అవకాశాలను కల్పించినప్పటికీ, మాతృభాషల మనుగడకు కొత్త సవాళ్లను కూడా సృష్టించాయి. ముఖ్యంగా ప్రపంచవ్యాప్తంగా కొన్ని ఆధిపత్య భాషలకు పెరుగుతున్న ప్రాధాన్యం కారణంగా అనేక ప్రాంతీయ, అల్పసంఖ్యాక మాతృభాషలు క్రమంగా తమ సామాజిక ప్రాధాన్యాన్ని కోల్పోతున్నాయి. ప్రపంచీకరణ ప్రభావంతో ఉపాధి, ఉన్నత విద్య, అంతర్జాతీయ వాణిజ్యం, సమాచార సాంకేతిక రంగాలలో ఆంగ్లభాష వంటి ప్రపంచ భాషలకు విశేష ప్రాధాన్యం ఏర్పడింది. దీనివల్ల అనేక కుటుంబాలు తమ పిల్లల భవిష్యత్తు కోసం మాతృభాష కంటే ఆంగ్ల మాధ్యమ విద్యను ఎంచుకుంటున్నాయి. ఇతర భాషలను నేర్చుకోవడం అభివృద్ధికి అవసరమే అయినప్పటికీ,

> **సాంకేతిక విజ్ఞానం మాతృభాషలకు ఒకవైపు సవాలుగా కనిపించినప్పటికీ, మరోవైపు అపూర్వమైన అవకాశాలను కూడా కల్పిస్తోంది.**

మాతృభాషను నిర్లక్ష్యం చేయడం వల్ల పిల్లలు తమ సాంస్కృతిక మూలాలతో క్రమంగా దూరమవుతున్నారు. ఈ పరిస్థితి భాషా సంక్రమణపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతోంది. విద్యా వ్యవస్థ కూడా మాతృభాషల భవిష్యత్తును నిర్ణయించే ప్రధాన అంశంగా మారింది. ప్రాథమిక విద్యను మాతృభాషలో అభ్యసించిన విద్యార్థులు విషయాలను త్వరగా అర్థం చేసుకుంటారని, వారి ఆలోచనా సామర్థ్యం, సృజనాత్మకత, అభ్యాస నైపుణ్యాలు మెరుగుపడతాయని అనేక పరిశోధనలు నిరూపించాయి. అయినప్పటికీ సామాజిక ప్రతిష్ఠ, ఉద్యోగ అవకాశాల పేరుతో మాతృభాషా విద్యను ద్వితీయ స్థానంలో ఉంచడం అనేక ప్రాంతాలలో కనిపిస్తోంది. ఈ పరిస్థితి మాతృభాషల వినియోగాన్ని క్రమంగా పరిమితం చేస్తోంది. ఈ సందర్భంగా యునెస్కో తన Education in a Multilingual World (2003) నివేదికలో ప్రాథమిక విద్య మాతృభాషలోనే ఉండడం విద్యార్థుల సమగ్ర వికాసానికి అత్యంత అవసరం అని స్పష్టంగా పేర్కొంది. మాతృభాష ఆధారిత బహుభాషా విద్య (Mother Tongue-Based Multilingual Education) విద్యా నాణ్యతను పెంచడమే కాకుండా భాషా వైవిధ్య పరిరక్షణకు కూడా దోహదపడుతుందని ఆ నివేదిక సూచిస్తుంది.

భారతదేశంలో జాతీయ విద్యా విధానం 2020 (National Education Policy 2020) కూడా ప్రాథమిక దశలో మాతృభాష లేదా ప్రాంతీయ భాషలో బోధనకు ప్రాధాన్యం కల్పించింది. ఇది మాతృభాషా విద్య ప్రాముఖ్యతను ప్రభుత్వ స్థాయిలో గుర్తించిన ఒక ముఖ్యమైన అడుగుగా చెప్పవచ్చు. అయితే ఈ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయడం, నాణ్యమైన పాఠ్యపుస్తకాలు, శిక్షణ పొందిన ఉపాధ్యాయులను అందుబాటులో ఉంచడం కూడా అంతే అవసరం.

సాంకేతిక విజ్ఞానం మాతృభాషలకు ఒకవైపు సవాలుగా కనిపించినప్పటికీ, మరోవైపు అపూర్వమైన అవకాశాలను కూడా కల్పిస్తోంది. ఒకప్పుడు

భాషలను రక్షించాలంటే వాటిని ప్రజల నిత్యజీవితంలో, కుటుంబంలో, విద్యలో, సామాజిక వ్యవహారాలలో సజీవంగా ఉంచాలని ఆయన పేర్కొన్నారు.

ముద్రిత గ్రంథాలకు మాత్రమే పరిమితమైన భాషలు నేడు డిజిటల్ ప్రపంచంలో విస్తృత స్థానం పొందుతున్నాయి. యూనికోడ్ లిపి, ఈ పుస్తకాలు, డిజిటల్ నిఘంటువులు, ఆన్‌లైన్ విద్య, కృత్రిమ మేధస్సు, యాంత్రిక అనువాదం, వాయిస్ టెక్నాలజీ వంటి రంగాలలో మాతృభాషలకు కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా తెలుగు వంటి భాషలు డిజిటల్ వేదికల ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పాఠకులను చేరుకుంటున్నాయి. అయితే సాంకేతిక అభివృద్ధి ప్రయోజనాలు అన్ని భాషలకు సమానంగా అందడం లేదు. డిజిటల్ వనరులు, శాస్త్రీయ పదకోశాలు, భాషా డేటాబేసులు, సాఫ్ట్‌వేర్ మద్దతు తక్కువగా ఉన్న భాషలు డిజిటల్ ప్రపంచంలో వెనుకబడుతున్నాయి. అందువల్ల భాషా అభివృద్ధిని సాంకేతిక అభివృద్ధితో అనుసంధానించడం కాలానుగుణ అవసరంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రముఖ భాషాశాస్త్రవేత్త జోషువా ఎ. ఫిష్‌మన్ చేసిన ఒక వ్యాఖ్య ఎంతో సమంజసంగా ఉంటుంది. భాషలను రక్షించాలంటే వాటిని ప్రజల నిత్యజీవితంలో, కుటుంబంలో, విద్యలో, సామాజిక వ్యవహారాలలో సజీవంగా ఉంచాలని ఆయన పేర్కొన్నారు. భాషను కేవలం పాఠ్యాంశంగా కాకుండా జీవన భాషగా కొనసాగించినప్పుడే దాని భవిష్యత్తు సురక్షితమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు (Joshua A. Fishman, Reversing Language Shift, 1991). ప్రపంచీకరణ, విద్యా విధానాలు, సాంకేతిక అభివృద్ధి మాతృభాషలపై చూపుతున్న ఈ ప్రభావం భారతదేశంలోని భాషా అల్పసంఖ్యాక సమాజాలలో మరింత స్పష్టంగా కనిపిస్తుంది. ముఖ్యంగా తమిళనాడులో తెలుగు భాష చారిత్రకంగా బలమైన స్థానాన్ని కలిగి ఉన్నప్పటికీ, నేడు అనేక సామాజిక, విద్యా, సాంస్కృతిక సవాళ్లను ఎదుర్కొంటోంది. అందువల్ల తమిళనాడులో తెలుగు భాష యొక్క చారిత్రక నేపథ్యం, ప్రస్తుత పరిస్థితి, భవిష్యత్తు అవకాశాలను విశ్లేషించడం ఈ అధ్యయనంలో అత్యంత అవసరమైన అంశంగా నిలుస్తుంది.

5. మరుగున పడుతున్న మాతృభాషల పరిరక్షణ, అవసరం మరియు కార్యాచరణ:

మాతృభాషలు క్రమంగా మరుగున పడుతున్న ప్రస్తుత పరిస్థితిలో వాటి పరిరక్షణ అనేది అత్యంత అత్యవసరమైన సాంస్కృతిక బాధ్యతగా మారింది. భాష ఒకసారి పూర్తిగా అంతరించిపోయిన తరువాత దానిని తిరిగి పునరుద్ధరించడం అత్యంత క్లిష్టమైన ప్రక్రియ. అందువల్ల భాష ఇంకా సజీవంగా ఉన్నప్పుడే దానిని సంరక్షించేందుకు సమగ్ర కార్యాచరణను రూపొందించాలి. మాతృభాషల పరిరక్షణ కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు; కుటుంబం, విద్యాసంస్థలు, రచయితలు, పరిశోధకులు, స్వచ్ఛంద సంస్థలు, మీడియా, సాంకేతిక నిపుణులు, సమాజం మొత్తం భాగస్వామ్యం కావాల్సిన సామూహిక బాధ్యత. మాతృభాష పరిరక్షణలో కుటుంబం అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుంది. పిల్లలు మొదట భాషను నేర్చుకునేది ఇంటి వాతావరణంలోనే. తల్లిదండ్రులు పిల్లలతో మాతృభాషలో సంభాషించడం, కథలు చెప్పడం, జానపద గేయాలు, సామెతలు, సాంప్రదాయ జ్ఞానాన్ని పంచుకోవడం ద్వారా భాష సహజంగా తరువాతి తరానికి సంక్రమిస్తుంది. కుటుంబంలో భాషా వినియోగం తగ్గినప్పుడు, విద్యాసంస్థలు మాత్రమే ఆ లోటును పూర్తిగా భర్తీ చేయలేవు. అందువల్ల మాతృభాష పరిరక్షణకు కుటుంబమే మొదటి కేంద్రంగా నిలవాలి. విద్యా వ్యవస్థలో కూడా మాతృభాషకు తగిన ప్రాధాన్యం కల్పించడం అత్యవసరం. ప్రాథమిక స్థాయిలో మాతృభాషలో బోధన విద్యార్థుల మేధో వికాసాన్ని, ఆలోచనా సామర్థ్యాన్ని, అభ్యాస నైపుణ్యాలను పెంపొందిస్తుందని అనేక పరిశోధనలు నిరూపించాయి. మాతృభాషతో పాటు ఇతర భారతీయ భాషలు, అంతర్జాతీయ భాషలను కూడా నేర్చుకునే అవకాశాలు కల్పించడం ద్వారా బహుభాషా సామర్థ్యాన్ని పెంపొందించవచ్చు. ఇది మాతృభాష పరిరక్షణకు, ప్రపంచ జ్ఞానంతో అనుసంధానానికి సమానంగా దోహదపడుతుంది.

మాతృభాష పరిరక్షణలో కుటుంబం అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుంది. పిల్లలు మొదట భాషను నేర్చుకునేది ఇంటి వాతావరణంలోనే.

ఈ సందర్భంలో జాతీయ విద్యా విధానం 2020 మాతృభాష లేదా స్థానిక

భాషలో ప్రాథమిక విద్యను ప్రోత్సహించడం ఒక సానుకూల పరిణామంగా చెప్పవచ్చు. ఈ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి నాణ్యమైన పాఠ్యపుస్తకాలు, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, ఆధునిక బోధనా విధానాలు అందుబాటులో ఉండాలి.

> **రచయితలు, కవులు, పరిశోధకులు, భాషా శాస్త్రవేత్తలు, మీడియా సంస్థలు కూడా మాతృభాషల పరిరక్షణలో చురుకైన పాత్ర పోషించాలి.**

ప్రస్తుత డిజిటల్ యుగంలో మాతృభాషల అభివృద్ధికి సాంకేతిక విజ్ఞానం అత్యంత ప్రభావవంతమైన సాధనంగా మారింది. డిజిటల్ గ్రంథాలయాలు, ఈ–పుస్తకాలు, యూనికోడ్ లిపి, ఆన్‌లైన్ నిఘంటువులు, కృత్రిమ మేధస్సు ఆధారిత భాషా సాంకేతికత, యాంత్రిక అనువాదం, వాయిస్ గుర్తింపు వ్యవస్థలు వంటి రంగాలలో మాతృభాషలకు ప్రాధాన్యం కల్పించాలి. భాష ఆధునిక సాంకేతిక ప్రపంచంలో స్థానం సంపాదించినప్పుడే యువత దానిని ఎక్కువగా వినియోగించే అవకాశం ఉంటుంది.

యునెస్కో తన Language Vitality and Endangerment (2003) నివేదికలో భాషల పరిరక్షణకు ప్రభుత్వ విధానాలు, విద్య, సామాజిక వినియోగం, డిజిటల్ అభివృద్ధి, తరాల మధ్య భాషా సంక్రమణ వంటి అంశాలు సమన్వయంతో పనిచేయాలని సూచించింది. భాష కేవలం పాఠ్యపుస్తకాలలో కాకుండా ప్రజల నిత్యజీవితంలో సజీవంగా ఉండాలని ఆ నివేదిక ప్రధానంగా పేర్కొంటుంది. అదేవిధంగా రచయితలు, కవులు, పరిశోధకులు, భాషా శాస్త్రవేత్తలు, మీడియా సంస్థలు కూడా మాతృభాషల పరిరక్షణలో చురుకైన పాత్ర పోషించాలి. సమకాలీన సాహిత్యం, బాలసాహిత్యం, శాస్త్రీయ రచనలు, అనువాద గ్రంథాలు, డిజిటల్ కంటెంట్, పరిశోధన ప్రచురణలు నిరంతరం వెలువడాలి. ఒక భాషలో కొత్త జ్ఞానం సృష్టించబడినప్పుడే ఆ భాష జీవంతంగా కొనసాగుతుంది. అందువల్ల మాతృభాషల పరిరక్షణను కేవలం భావోద్వేగ అంశంగా కాకుండా సాంస్కృతిక, విద్యా, సామాజిక, సాంకేతిక, జాతీయ అభివృద్ధికి సంబంధించిన సమగ్ర కార్యాచరణగా పరిగణించాలి.

కుటుంబం నుండి విశ్వవిద్యాలయం వరకు, స్థానిక సమాజం నుండి ప్రభుత్వ విధానాల వరకు ప్రతి స్థాయిలో సమన్వయపూర్వక కృషి జరిగినప్పుడే మరుగున పడుతున్న మాతృభాషలను భావితరాలకు సజీవంగా అందించగలుగుతాము.

ఈ నేపథ్యంలో ఈ వ్యాసంలో చర్చించిన అంశాలను సమగ్రంగా సమీక్షిస్తూ ఉపసంహారంలో మాతృభాషల పరిరక్షణ యొక్క ఆవశ్యకతను పునరుద్ఘాటించడం సముచితంగా ఉంటుంది.

కుటుంబం మాతృభాషను దైనందిన జీవితంలో సజీవంగా ఉంచాలి. విద్యాసంస్థలు మాతృభాష ఆధారిత విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి.

6. ఉపసంహారం:

మాతృభాష అనేది వ్యక్తి ఆలోచనలకు, భావవ్యక్తీకరణకు, సాంస్కృతిక చైతన్యానికి, సామాజిక అస్తిత్వానికి మూలాధారం. ఒక జాతి చరిత్ర, సంప్రదాయాలు, జానపద విజ్ఞానం, సాహిత్య సంపద, జీవన విలువలు అన్నీ మాతృభాష ద్వారానే తరతరాలకు సంక్రమిస్తాయి. అందువల్ల మాతృభాషను పరిరక్షించడం అంటే కేవలం ఒక భాషను కాపాడటం మాత్రమే కాదు; ఒక సమాజపు సాంస్కృతిక వారసత్వాన్ని, చారిత్రక స్మృతిని, మానవ నాగరికతలోని వైవిధ్యాన్ని సంరక్షించడం కూడా. ఈ వ్యాసంలో పరిశీలించినట్లుగా ప్రపంచీకరణ, పట్టణీకరణ, ఆధిపత్య భాషల ప్రభావం, విద్యా విధానాలలో వచ్చిన మార్పులు, ఉపాధి అవసరాలు, కుటుంబ వ్యవస్థలో సంభవించిన పరిణామాలు వంటి అనేక కారణాలు మాతృభాషలను క్రమంగా మరుగున పడే పరిస్థితికి నెట్టాయి. ముఖ్యంగా తరాల మధ్య భాషా సంక్రమణ తగ్గిపోవడం, పిల్లలు తమ మాతృభాషను సహజంగా నేర్చుకునే అవకాశాలు తగ్గడం, డిజిటల్ ప్రపంచంలో కొన్ని భాషలకు మాత్రమే అధిక ప్రాధాన్యం లభించడం వంటి అంశాలు భాషల మనుగడకు సవాలుగా మారాయి. అయితే ఈ పరిస్థితిని అధిగమించడం అసాధ్యం కాదు. కుటుంబం మాతృభాషను దైనందిన జీవితంలో సజీవంగా ఉంచాలి. విద్యాసంస్థలు మాతృభాష ఆధారిత విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రభుత్వాలు సమర్థవంతమైన భాషా విధానాలను అమలు చేయాలి. రచయితలు, పరిశోధకులు, సాంకేతిక నిపుణులు భాషను ఆధునిక

విజ్ఞాన ప్రపంచంతో అనుసంధానించే కార్యక్రమాలను చేపట్టాలి. ఈ సమిష్టి కృషి ద్వారానే మరుగున పడుతున్న మాతృభాషలకు పునర్జీవం కల్పించడం సాధ్యమవుతుంది.

ఈ సందర్భంగా యునెస్కో పేర్కొన్న అభిప్రాయం అత్యంత సందర్భోచితంగా నిలుస్తుంది."Languages are the most powerful instruments of preserving and developing our tangible and intangible heritage." (UNESCO, International Mother Language Day Message.) అంటే భాషలే మానవాళి భౌతిక, అభౌతిక సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించే అత్యంత శక్తివంతమైన సాధనాలు. అందువల్ల భాషల పరిరక్షణ అనేది కేవలం భాషా ఉద్యమం మాత్రమే కాదు; అది మానవ నాగరికతను, సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడే విశ్వమానవ బాధ్యత. మాతృభాషను ప్రేమించడం భావోద్వేగం మాత్రమే కాదు; అది చరిత్ర పట్ల గౌరవం, సంస్కృతి పట్ల నిబద్ధత, భావితరాల పట్ల బాధ్యత. మాతృభాష బతికితేనే సంస్కృతి బతుకుతుంది; సంస్కృతి బతికితేనే సమాజం తన అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని, సృజనాత్మకతను నిలబెట్టుకోగలదు. కాబట్టి మరుగున పడుతున్న మాతృభాషలను పరిరక్షించడం ప్రతి పౌరుడి, ప్రతి కుటుంబం, ప్రతి విద్యాసంస్థ, ప్రతి ప్రభుత్వానికి ఉమ్మడి బాధ్యతగా గుర్తించి కార్యాచరణను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. "దేశభాషలందుతెలుగులెస్స" శ్రీకృష్ణదేవరాయలు ఈ వాక్యం కేవలం తెలుగు భాష గొప్పతనాన్ని మాత్రమే కాకుండా, ప్రతి వ్యక్తి తన మాతృభాషను గౌరవించి, సంరక్షించి, భావితరాలకు అందించాలనే శాశ్వత సందేశాన్ని కూడా అందిస్తుంది.

7. ఆధార గ్రంథాలు:

1. భద్రిరాజు కృష్ణమూర్తి, తెలుగు భాషా చరిత్ర, తెలుగు అకాడమీ, హైదరాబాద్, 1989.

2. గిడుగు వెంకట రామమూర్తి, వ్యావహారిక భాషోద్యమ వ్యాసాలు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

3. చేకూరి రామారావు, తెలుగు వాక్యం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

4. నాయని కృష్ణకుమారి, తెలుగు జానపద విజ్ఞానం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 1993.

5. David Crystal, Language Death, Cambridge University Press, Cambridge, 2000.

6. Joshua A. Fishman, Reversing Language Shift, Multilingual Matters, Clevedon, 1991.

7. UNESCO, Language Vitality and Endangerment, Paris, 2003.

8. National Education Policy (NEP–2020), Ministry of Education, Government of India,

New Delhi, 2020.

ధన్యోస్మి

ఈ సంచిక ‘ప్రకాశిక’ 6వ సంవత్సరంలోని మూడవ సంచిక. ఎందరో అభిమానుల, సంపాదక వర్గ సభ్యుల సహాయ సహకారాలతో ఇప్పటివరకు ‘ప్రకాశిక’ తెలుగు పత్రికా రంగంలో విశిష్టమైన స్థానం సంపాదించుకుందని పలువురి ప్రశంసల ద్వారా విని ఆనందం కలుగుతోంది.

ఈ సంచిక వెలువరించడంలో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ సహకరించిన వారందరో, వారందరికీ వందనములు. ముఖ్యంగా, వ్యాస రచయితలతో సమన్వయం చేసిన ప్రకాశిక సంపాదక వర్గ సభ్యులు డాక్టర్ వింధ్యవాసిని గారికి ప్రత్యేక ధన్యవాదాలు. ప్రచురణ కోసం కథలు, కవితలు, పరిశోధనా వ్యాసాలు పంపమని రచయితలను కోరుతున్నాము.

ఎప్పటిలాగే పాఠకులు ఈ సంచిక ను కూడా చదివి ఆనందిస్తారని ఆశిస్తాను.

చదవండి, చదివించండి.

భవదీయుడు

ఆచార్య కొవ్వలి గోపాలకృష్ణ

ప్రధాన సంపాదకులు

ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org

ప్రకాశిక

సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక

సంపుటి 6 | సంచిక 3 జులై-సెప్టెంబర్ 2026

మమత-సమత-మానవత
www.gurajada.org